ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
గురువారం 24 జూలై 2025

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 26.0



రెవెన్యూ అంశాలపై సమీక్షిస్తున్న సీసీఎల్ఏ అదనపు కమిషనర్ ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి

భూముల రీ సర్వేలో తప్పులను సహించేది లేదు

» సీసీఎల్ఏ అదనపు కమిషనర్ ప్రభాకర్‌రెడ్డి

ఏలూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి):'జిల్లాలో భూముల రీ సర్వేలోనూ తప్పులే.. పేదల నివాసాల దరఖాస్తుల పరిశీలన నివేదికల సిద్ధంలోనూ జాప్యమెందుకు జరుగుతుంది. ఈసారి మొదటి తప్పుగా హెచ్చరికతో సరిపెడుతున్నా.. మరొకసారి ఆకస్మిక తనిఖీలకు వస్తా.. మార్పు జరగ పోతే సస్పెండ్ చేస్తా'నని రాష్ట్ర భూపరిపాలనా శాఖ (సీసీఎల్ఏ) అదనపు కమిషనర్, సర్వేశాఖ డైరెక్టర్ ఎన్. ప్రభాకర్‌రెడ్డి అధికారులను హెచ్చరించారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన బుధవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ అంశాలు, రీ- సర్వేపై కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డితో కలిసి రెవెన్యూ,ల్యాండ్ సర్వేశాఖ అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జీవో 30 ప్రకారం అభ్యంతరం లేని ఆక్రమణల క్రమబద్ధీకరణ దరఖాస్తులు ఎక్కడికెక్కడ పెండింగ్‌లో ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రగతిలో వెనుకబడిన అధికారులను కారణాలను అడిగి తెలుసుకున్నారు. రీ సర్వే కార్యక్రమాన్ని ఛాలెంజింగ్‌గా స్వీకరించాలని, రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను పిలిచి ఒక పండుగలా కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఇప్పటికి రెండో విడత రీ సర్వే జరుగుతోందని, మూడో విడత సర్వేను త్వరలో ప్రారంభించాలని ఆదేశించారు. నిరుపేదల ఇళ్ల స్థలాలకు ఆగస్టు 15వ తేదీలోగా పట్టాలు సిద్ధం చేయాలన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన ప్రతీ అర్జీకి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. డీఆర్వో విశ్వేశ్వరరావు, సబ్‌కలెక్టర్ స్మరణ్‌రాజ్, ఆర్డీవోలు అచ్యుత అంబరీష్, రమణ,ల్యాండ్ సర్వేశాఖ ఏడీ అన్సారిలు పాల్గొన్నారు.

అర్థవంతంగా పీ- 4 గ్రామసభలు : కలెక్టర్

ఏలూరు,జూలై 23(ఆంధ్రజ్యోతి):పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వం చేపట్టిన పీ-4 కార్యక్రమంలో గ్రామసభలను అర్థవంతంగా నిర్వహించి, వాటి వివరాలను వెంటనే అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. గ్రామసభల నిర్వహణ, బంగారు కుటుంబాలు, మార్గదర్శకుల ఎంపిక తదితర అంశాలపై కలెక్టర్ బుధవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జడ్పీ సీఈవో శ్రీహరి, ఎంపీడీవోలు, నియోజకవర్గ ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

● జిల్లాలో గిరిజనుల అభివృద్ధికి అమలు చేసే కార్యక్రమాలపై మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇచ్చి వారి ద్వారా సిబ్బందికి పూర్తిస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని కలెక్టర్ వెట్రిసెల్వి రాష్ట్ర మహిళా,శిశు, గిరిజనశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి వివరించారు. మంత్రి విజయవాడలో ఆదికర్మ యోగి యోజన కార్యక్రమం ప్రారంభించిన అనంతరం జిల్లా కలెక్టర్లతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఐటీడీఏ పీఈవో రాములు, గిరిజనశాఖ అధికారులు పాల్గొన్నారు.

విభజన.. ఆశలు!





మళ్లీ ఆశల పల్లకీ. ఎన్నికలకు ముందు ఆ తర్వాత ఎన్నో ప్రజా విజ్ఞాపనలు. నాయకుల నోట ఇంకొన్ని హామీల వెల్లువ. ఉమ్మడి జిల్లాల్లో ఉన్న స్థితిగతులకు లోబడి రాజకీయంగా, పాలనా పరంగా సర్దుకు పోయేవారు. కానీ జిల్లాల పునర్విభజన జరిగిన తర్వాత మొత్తం సీన్ తలకిందు లైంది. పరస్పరం సహకారం ఉండా ల్సింది పోయి కాస్త దూరంగా జరగాల్సి వచ్చింది. సామాజికవర్గాలకు కూడా సమతుల్యమే దెబ్బతిన్నట్లైంది. మళ్లీ జిల్లాల పునర్విభజన సమయంలో వెలువడిన అభ్యంతరాలు, డిమాండ్లు, స్థానికంగా ఉన్న సంప్రదాయాలు, సెంటిమెంట్లు అన్నింటిని కలబోసి సరికొత్త అధ్యయనానికి వీలుగా మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటైంది. ఇప్పటివరకు సాగిన డిమాండ్లు, ఎత్తుగడలు మళ్లీ పదును నెక్కబోతున్నాయి. రాజకీయపరంగా ఈ నిర్ణయం కొందరికి సవాలే.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

పునర్విభజనపై మళ్లీ కసరత్తు

» మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు
» ఇంతకుముందున్న అభ్యంతరాలకే జీవం
» నియోజకవర్గాల పునర్విభజనకు ముందు కష్టం
» నూజివీడు, కైకలూరు డిమాండ్‌లు మళ్లీ మొదటికి

పార్లమెంటరీ నియోజకవర్గాలను ప్రాతిపదికగా తీసుకుని నూతన జిల్లాల ఏర్పాటుకు అప్పటి వైసీపీ ప్రభుత్వం 2022లోనే ముందడుగు వేసింది. ఎవరు కాదన్న, కనీసం వాదనలకు తావులేకుండా తాము అనుకున్నది అనుకున్నట్లుగానే జిల్లాలు ఏర్పాటు చేశారు. అనేక సందేహాలు, అనుమానాలు, వివాదాలు తలెత్తినా అప్పట్లో డోంట్‌కేర్‌గా వ్యవహరించారు. ఏలూరు జిల్లాలో నూజివీడు, కైకలూరు ఉండేలా చూశారు. కాని సుదీర్ఘకాలం పాటు అటు గుడివాడ, ఇటు విజయవాడతో సాన్నిహిత్యం ఉన్న ఈ రెండు నియోజకవర్గాల జనం లబోదిబోమన్నారు. రాజకీయపరంగా, పాలనా పరంగా తమకు ఇది ఆమోదయోగ్యం కాదన్నారు. తమకు వ్యాపార సంబంధాలున్న విజయవాడను కాదని ఏలూరును జిల్లా కేంద్రంగా ఉండడంతో నూజివీడు వాసులు ససేమిరా వీల్లేదని అడ్డం తిరిగారు. పాలనాపరంగా తమకు ఏలూరుతో సత్సంబంధాలు లేని విషయాన్ని గుర్తు చేశారు. అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే మేకా ప్రతాప అప్పారావు కూడా తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకొస్తూ ఏకంగా నిరసన ర్యాలీలకు దిగారు. కానీ నిర్ణయం జరిగిపోయిన తర్వాత తిరిగి వెనక్కి తీసుకోవడం సాధ్యం కాదని, అంతకంటే మించి నిరసనలు మరింత పేట్రేగితే వైసీపీ పెద్దల నుంచి ఇంకో రకం ఒత్తిడులను ఎదుర్కోవాల్సి వస్తోందని అప్పట్లో ప్రతాప అప్పారావు కూడా మదనపడాల్సి వచ్చింది. ఇదే తరుణంలో నూజివీడు నియోజకవర్గాన్ని ఉమ్మడి కృష్ణాలోనే కొనసాగించాలన్న డిమాండ్ ఎన్నికల ప్రచారాన్ని తాకింది. ఈ నేపథ్యంలోనే నూజివీడులో ఎన్నికల పర్యటనకు వచ్చిన ఆనాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు దృష్టికి స్థానిక నేతలు తీసుకెళ్లారు. దీనిపై ప్రజలు సంతృప్తిపడేలా విధాన ప్రకటన చేయాల్సిందిగా ఆయనపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేశారు. అప్పట్లో జనం నుంచి ఎదురైన స్పందన చూసి చంద్రబాబే.. మీరంతా విజయవాడకు దగ్గరగా ఉంటున్నారు. ఏలూరు వద్దంటున్నారు. తెలుగుదేశం అధికారంలోకి వస్తే వెంటనే ఈ సమస్యను పరిష్కరిస్తా. ఉమ్మడి కృష్ణాలోనే నూజివీడును కొనసాగించేలా చూస్తానని ఎన్నికల హామీ ఇచ్చేశారు. ఇదే తరుణంలో నూజివీడు డివిజన్ పూర్తిగా బలహీనపడింది. డివిజన్ కేంద్రంగా నూజివీడుకు గొప్ప చరిత్ర ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని డివిజన్‌ను యథావిధిగా కొనసాగించేందుకు చింతలపూడి, లింగపాలెం మండలాలను నూజివీడు డివిజన్‌లో విలీనం చేశారు. దీంతో అప్పటి వరకు ఏలూరుతో సత్సంబంధం ఉన్న ఈ రెండు మండలాలకు చెందిన వారు రెవెన్యూ డివిజన్‌లో విలీనాన్ని పూర్తిగా వ్యతిరేకించారు. అయినా విలీనం ప్రక్రియ అధికారికంగా జరిగినందున అప్పట్లో ఏ పార్టీకి చెందిన వారైనా ఏమీ చేయలేని పరిస్థితి.ఇప్పటికీ నూజివీడు రెవెన్యూ డివిజన్ అంటే చింతలపూడినే రెవెన్యూ డివిజన్‌గా మార్చాలనే ప్రతిపాదన కొందరి నోట తెరపైకి వచ్చింది. సాధారణంగా ఏలూరుకు అత్యంత సమీపంగా ఉన్న మండలాలను కాస్తంత దూరంగా ఉన్న నూజివీడుకు బదలాయించడమే ఇప్పటికీ ఆ ప్రాంత వాసులకి అసంతృప్తి మిగిల్చింది.

కైకలూరు నియోజకవర్గ వాసులు ఇంకో డిమాండ్‌ను తెరపైకి తీసుకొచ్చారు. అప్పట్లో కైకలూరు గుడివాడ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండేది. విభజన తర్వాత ఈ ప్రాంతం కాస్త ఏలూరు డివిజన్ పరిధిలోకి వచ్చింది. దీంతో తమను గుడివాడకే పరిమితం (మిగతా 8వ పేజీలో)


కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో పీడీని విచారణ చేస్తున్న డీవైఈవో రవీంద్రభారతి

కలిదిండి పీడీపై విచారణ

కలిదిండి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థినుల పట్ల వ్యాయామోపాధ్యాయుడు (పీడీ) కె.రత్నదాస్‌పై అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడన్న ఆరోపణలపై డీవైఈవో ఎస్.రవీంద్ర భారతి, ఎంఈవో-1,2 రవిప్రకాష్, శ్రీనివాసరావు బుధవారం కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో విచారణ జరిపారు. డీవైఈవో మాట్లాడుతూ తమతో పీడీ అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని, కొడుతున్నాడని విద్యార్థినులు రాసిచ్చారన్నారు. తనను దుర్భాషలాడుతూ బెదిరిస్తూ కొట్టడానికి వస్తున్నాడని ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణకుమారి చెప్పారన్నారు. పీడీ రత్నదాస్‌ను విచారించగా, తన కుటుంబంలో విబేధాలు ఉండడంతో మానసిక పరిస్థితి సరిగా లేదని సమాధానం ఇచ్చారన్నారు. దీంతో ఫోర్స్‌డ్ లీవ్‌లో ఉండాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. పూర్తి విచారణ నివేదికను డీఈవో వెంకట లక్ష్మమ్మకు సమర్పిస్తామన్నారు.


తేరగూడెం ప్రాథమిక పాఠశాలలో గ్రామస్థులతో సమావేశమైన ఎంఈవో

మూసేస్తే తిరిగి ప్రారంభిస్తారా..?

» తేరగూడెం స్కూలు మూసివేత ప్రతిపాదనపై గ్రామస్థుల అభ్యంతరం

ముదినేపల్లి, జూలై 23(ఆంధ్రజ్యోతి):ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఉన్న పేరూరు శివారు తేరగూడెం ప్రాథమిక పాఠశాలను మూసేసే విషయంలో విద్యాశాఖ అధికారులకు గ్రామస్థుల నుంచి ప్రతిఘటన ఎదురైంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంఈవో -2 నరేష్‌కుమార్ బుధవారం సీఆర్పీ ఆంజనేయులుతో కలిసి ఆ పాఠశాలకు వెళ్లి గ్రామస్థులు, ఎస్ఎంసీ చైర్మన్‌తో సమావేశం నిర్వహించి విద్యార్థులు ఇద్దరే ఉన్నందున పాఠశాలను మూసేయాల్సి వస్తోందని వివరించారు. ఇందుకు గ్రామస్థులు అంగీకరించలేదు. దళితవాడలో పాఠశాల మూసేస్తే తిరిగి ప్రారంభిస్తారా.. అంటూ గ్రామస్థులతో పాటు ఎస్ఎంసీ చైర్మన్ బండి సుభాకరరావు అధికారులను ప్రశ్నించారు. స్కూలు మూసేయాలన్న అధికారులను ప్రతిపాదనకు గ్రామస్థుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైన నేపథ్యంలో ఇదే విషయాన్ని జిల్లా విద్యాశాఖాధికారులకు నివేదిక పంపనున్నట్టు ఎంఈవో తెలిపారు.

అసైన్డ్ మాఫియా.. గుట్టు రట్టయ్యేనా



» మూడువేల ఎకరాల ఫ్రీహోల్డ్ భూములపై పరిశీలనలు
» ప్రభుత్వ ఆదేశంతో అసైన్డ్ భూములు యథాతథం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

రైతుల సాగులో ఉన్నవి. దళితులు, బడుగులకు జీవనోపాధికి కోసం ఇచ్చిన అసైన్డ్ భూములను గత వైసీపీ ప్రభుత్వం చట్టబద్ధంగా దక్కించుకోవాలని జీవో నంబరు 596ను తీసుకొచ్చింది. ఇరవై ఏళ్ల పైబడిన భూములు అసైన్డ్ చేసినవి సహజంగా అమ్మకాలు జరుపుకోవడానికి భూమి పొందిన వారికి అవకాశం ఉంది. దీన్ని అవకాశంగా మలచుకుని 20 ఏళ్లకు మించనవి కూడా ఫ్రీహోల్డ్ చేసి అమ్మకాలతో గుటకాయ స్వాహాకు అప్పటి వైసీపీ పాలకులు ప్రయత్నాలు చేశారు. జిల్లాలో దాదాపుగా 17 వేల ఎకరాలకు ఎసరు పెట్టే ప్రయత్నాలు ముమ్మరంగా జరిగాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం నిషేధిత భూములను 22 (ఏ) నుంచి తప్పించిన భూముల వ్యవహారంపై కట్టుదిట్టమైన చర్యలకు దిగింది. జిల్లా వ్యాప్తంగా మూడువేల ఎకరాల సంబంధించి నిషేధిత జాబితా నుంచి తప్పించి ఎలా ఫ్రీహోల్డ్ చేశారన్న దానిపై ఆయా మండలాల్లో విచారణలు జరుగుతున్నాయి. ఇంకా ఎటూ తేలకపోవడంతో జిల్లా యంత్రాంగానికి ఈ వ్యవహారం మింగుడు పడడం లేదు. దీనిపై క్షేత్రస్థాయిలో కసరత్తులు జరుగుతూనే ఉన్నాయి.

ఫ్రీహోల్డ్‌పై ఆరా... కొందరి పాత్రపైనా విచారణలు

వాస్తవంగా ఇరవై ఏళ్ల పైబడి రైతుల ఆధీనంలో ఉన్న అసైన్డ్‌భూములను నిషేధిత జాబితా నుంచి ఫ్రీహోల్డ్ చేయాలి. కానీ 20 ఏళ్లు దాటని అసైన్డు భూములతో పాటు వాగులు, వంకలు, గుట్టలను 22(ఏ) నుంచి అప్పటి పాలకులు ఒత్తిడులతో పలువురి రెవెన్యూ అధికారులు తప్పించేశారు. జిల్లాలో వివిధ వర్గాల పేదలు, దళితులు అనుభవించేందుకు వీలుగా 17 వేల ఎకరాలు భూమి అసైన్డుగా ఉంది. ఇందులో కొన్ని భూములకు రిజిస్ట్రేషన్లు జరిగిపోయాయన్న విమర్శలు లేకపోలేదు. 27 మండలాల్లో దాదాపు చాలా మండలాల్లో ఈ తరహా అక్రమాలకు తెరతీసినట్టు ఆరోపణలున్నాయి. ప్రతీ మండలంలోనూ 100 నుంచి 200 ఎకరాలను ఫ్రీహోల్డ్ చేసి తమకు అనుకూలురుకు కట్టబెట్టాలన్న యత్నాలు బెడిసికొట్టాయి. ప్రభుత్వం లోతుగా విచారణ జరిపిస్తోంది. ఇందులో అప్పట్లో ఫ్రీహోల్డ్ జాబితా సిద్ధం చేసిన అధికారులు, సిబ్బందిపై విచారణలు జరుగుతున్నాయి. మాజీ ప్రజాప్రతినిధులు, ఇతర వ్యక్తులు, రెవెన్యూ అధికారుల పాత్రపైన విచారణ చేపడుతున్నట్టు తెలుస్తోంది.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం

» హోం మంత్రి అనిత



సభలో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత.. చిత్రంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

చింతలపూడి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని హోం మంత్రి అనిత పేర్కొన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో లింగపాలెం, చింతలపూడి మండలాల్లో సుపరిపాలనలో తొలి అడుగు, ఇంటింటా ప్రచారంలో పాల్గొనడానికి వచ్చిన మంత్రికి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఫాతిమా పురం, అంథోని నగర్‌లలో ప్రజలతో మాట్లా డారు. ఆంథోనినగర్‌లో కోటమ్మ అనే దళిత వృద్ధురాలు తన కన్ను కనపడడం లేదని, ఆపరేషన్ చేయించుకోవడానికి ఇబ్బందిగా ఉందని చెప్పడంతో ఆపరేషన్ చేయి స్తామని ఎమ్మెల్యే రోషన్‌కుమార్ బాధ్యత తీసుకుంటారని భరోసా ఇచ్చారు. కాలనీలోని మేరీమాత విగ్రహానికి పూలమాల వేశారు. పలు ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. లేదా అంటూ ఆరా తీశారు. అనంతరం స్థానిక ఆర్కే ఫంక్షన్ హాలులో జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ అర్హులైన రైతులందరి అకౌంట్లలో అన్నదాత సుఖీభవ సొమ్ములు జమ అవుతాయని, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఆగస్టు 15 నుంచి ప్రారంభం కాబోతుందన్నారు. నియోజకవర్గం లో ఏడాది పాలనలోనే ఎమ్మెల్యే రోషన్‌కుమార్ 150 కోట్లతో వివిధ పథకాలు సిద్ధం చేశారని, కొన్ని చోట్ల రోడ్ల గుంతల సమస్యలు ఉన్నాయని, త్వరలోనే వాటిని పరిష్కరిస్తారన్నారు. నియోజకవర్గ పరిశీలకులు కోళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ నాయకులు దోచిన సొమ్ము ప్రజలకు చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ ఏడాది సుపరిపాలన ప్రజలకు అందుతుందో, లేదో తెలుసుకోవాలన్న లక్ష్యమే ఇంటింటా ప్రచారమన్నారు. ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి మాట్లాడుతూ కూటమి పాలన ఎంతో బాగుందని ప్రజలు తెలుసుకోవాల న్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏడాది సుపరిపాలన గురించి గత ప్రభుత్వంలో జంగారెడ్డిగూడెంలో 2022లో జరిగిన సారా మరణాలపై వివరించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య మాట్లాడుతూ జగన్‌కు 11 సీట్లు ఇచ్చినా అవి కూడా నిలబెట్టుకునేలా లేరన్నారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రమ్ కిశోర్, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ సుపరిపాలన కూటమి లక్ష్యమన్నారు. బొబ్బర రాజపాల్, జగ్గవరపు ముత్తారెడ్డి పలువురు పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గం నాలుగు మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు.

పోలవరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం : మంత్రి అనిత
అంగన్‌వాడీల్లో గ్యాస్ కష్టాలకు చెక్
బాలికపై అత్యాచార యత్నం.. పోక్సో కేసు
■ లోపలి పేజీలో..



అప్పనవీడు సభలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

మీ మేనమామనంటూ.. జగన్ సున్నం రాశాడు

» పిల్లలందరికీ తల్లికి వందనం.. కూటమి ప్రభుత్వం ఘనత
» ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

పెదపాడు, జూలై 23(ఆంధ్రజ్యోతి):ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతి పిల్లవానికి తల్లికి వందనం పథకాన్ని అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని, గతంలో మీ మేనమామ అన్న జగన్ వారికి సున్నం రాశాడని బీసీ సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం, జౌళి అండ్ వస్త్ర పరిశ్రమల శాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. అప్పనవీడులో జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో మంత్రి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో అన్న క్యాంటీన్లను తొలగించి పేదల పొట్ట కొట్టాడని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటిని తిరిగి పునరుద్ధరించి వారికి మూడు పూటల కడుపు నింపుతోందన్నారు. పోలవరం, పట్టిసీమ వల్ల రాయలసీమలో నీటి కష్టాలు తీరుతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో భోజన నాణ్యత, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సవిత పేర్కొన్నారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమ నేని ప్రభాకర్, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ కూటమి సర్కారు సంక్షేమం, అభివృద్ధి కోసం నిత్యం పాటుపడుతోం దన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్ మాట్లాడుతూ కేంద్రంలో మోదీ పాలన, రాష్ట్రంలో చంద్రబాబు పాలనలో రాష్ట్రం అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, అభయాంజనేయస్వామి ఆలయ చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించరు..గుంతలు పూడ్చరు!

అధ్వానంగా చిత్తపూరు-బూరుగుగూడెం రోడ్డు
మంత్రి పార్థసారథి 'గుంతల రహిత రహదారుల పథకం' ప్రారంభించింది ఈ రోడ్డులోనే..




చాట్రాయి పాత పోస్టాఫీస్ దగ్గర, గ్రోమోర్ సెంటర్ దగ్గర రోడ్డు దుస్థితి

చాట్రాయి, జూలై 23(ఆంధ్రజ్యోతి): నూజివీడు ఎమ్మెల్యే, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి సుమారు ఆరు నెలల క్రితం చాట్రాయి పరిధిలో చిత్తపూరు-బూరుగుగూడెం ఆర్‌అండ్‌బీ రహదారిలో నియోజకవర్గ స్థాయిలో గుంతల రహిత రహదారుల పథకాన్ని ప్రారంభించారు. ఆ రోజు అధికారులు హడావుడిగా కొన్ని చోట్ల అరకొరగా గుంతలు పూడ్చారు. ఆపై గుంతలు పూడ్చే ప్రక్రియ నిలిపివేశారు. ఇందుకు కారణం కొత్త రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్లు నిధులు మంజూరు కావడమే. చాట్రాయి సెంటర్ నుంచి పీహెచ్‌సీ వరకు 600 మీటర్లు సీసీ రోడ్డు, అక్కడ నుంచి సుమారు 1.90 కిలో మీటర్లు బీటీ రోడ్డు నిర్మాణానికి మంత్రి చొరవతో నిధులు మంజూరై టెండర్లు ప్రక్రియ మూడు నెలల కిందట పూర్తయింది. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించడం లేదు. కొత్త రోడ్డు నిర్మాణం జరుగుందని అధికారులు గుంతలు పూడ్చడం లేదు. దీంతో వాహనాల తాకిడికి చాట్రాయి- బూరుగుగూడెం రోడ్డులో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి వాహన చోదకులు, ప్రజలు నరకయాతన పడుతున్నారు. చాట్రాయిలో పాత పోస్టాఫీస్, గ్రోమోర్ సెంటర్ వద్ద భారీ గోతులు ఏర్పడి ప్రజల ఇబ్బందులు వర్ణనాతీంగా ఉన్నాయి. వర్షాలకు గోతుల్లో నీరు నిలిచి ఈ రోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి తక్షణం గుంతలు పూడ్చించాలని, కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో పనులు చేపడతాం : డీఈఈ

చిత్తపూరు- బూరుగుగూడెం రహదారి(సీబీ రోడ్డు)లో రూ. మూడు కోట్లతో చాట్రాయి సెంటర్ నుంచి పీహెచ్‌సీ వరకు 600 మీటర్లు సీసీ రోడ్డు, అక్కడ నుంచి 1.90 కిలోమీటర్లు బీటీ రోడ్డు నిర్మాణ పనులు త్వరలో చేపడతాం. ఈ పనులు జరిగితే ప్రజల ఇబ్బందులు తీరతాయి.

– బాబూరావు, డీఈఈ, ఆర్‌అండ్‌బీ శాఖ, నూజివీడు

అల్పపీడన ద్రోణితో భారీ వర్షాలు


జీలుగుమిల్లిలో కురుస్తున్న వర్షం

ఏలూరుసిటీ/జీలుగుమిల్లి, జూలై23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాలు జోరుగా కొనసాగుతున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం అల్పపీడనం కారణంగా జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో బుధవారం భారీ వర్షాలు కురిశాయి. ఈనెల 24వ తేదీ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుం దని, బలమైన గాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయిని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.గడచిన 24 గంటల్లో అత్యధికంగా జీలుగుమిల్లి మండలంలో 55.6 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది.జిల్లాలో సరాసరి వర్షపాతం 20.3 మి.మీ నమోదైంది. వేలేరుపాడు 52.4, భీమడోలు 47.8, జంగారెడ్డిగూడెం 44.4, ముసునూరు 41.2, పెదవేగి 37.8, ఉంగుటూరు 23.4, చింతలపూడి 22.4, కుక్కునూరు 21, కామవరపుకోట 17.4, పెదపాడు 17.4, లింగపాలెం 16.6, నిడమర్రు 16.4, ఆగిరిపల్లి 16.2, ముదినేపల్లి 15.4, మండవల్లి 15.2, ద్వారకాతిరుమల 14.2, నూజివీడు 13.6, టి.నరసాపురం 12.4, కలిదిండి 12.4, చాట్రాయి 11.4, దెందులూరు 9.2, ఏలూరు అర్బన్ 9.2, బుట్టాయిగూడెం 9.2, కైకలూరు 8.2, ఏలూరు రూరల్ 5.4, కొయ్యలగూడెం 2.6 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి. ఈ వర్షాలు సార్వా పంటల సాగుకు అనుకూలిస్తాయని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. మెట్ట ప్రాంతంలో ఇప్పటి వరకు సరైన వర్షాలు లేక వరి నారుమడులకు తడులు అందేవి కాదు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో సార్వా సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు.

డేంజర్

రక్షణ లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు



భీమవరం తాడేరు రోడ్డులో ఎటువంటి రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్



ఇందిరమ్మ కాలనీ వద్ద పెట్రోల్ బంక్ ఎదురుగా ట్రాన్స్‌ఫార్మర్‌ను చుట్టేసిన తీగలు



కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో..



విస్సాకోడేరు రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్‌పైకి పాకిన తీగలు



ఉండి-ఆకివీడులో రోడ్డులో చెరుకువాడ వద్ద హెచ్‌టీ లైన్‌కు సంబంధించిన స్తంభానికి అల్లుకున్న తీగలు

- ఫొటోగ్రాఫర్, భీమవరం

ఏలూరు నగరంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు రక్షణ ప్రదేశాల్లో కాకుండా రోడ్డు మార్జిన్‌లలో, సందుల్లో ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు ప్రమాదకరంగా రాకపోకలు సాగించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. రామచంద్రరావుపేటలోని జీవీ మాల్ సమీపంలో డ్రెయిన్‌పైనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం, వన్‌టౌన్‌లోని మార్వాడీ గుడి వెనుకవైపు గల సందులో రోడ్డు మార్జిన్‌లోనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో ప్రమాదం నెలకొంది. సీపీఎం ఆఫీసు రోడ్డులో మేయర్ క్యాంపు కార్యాలయం సమీపంలో రోడ్డు మార్జిన్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, మస్తాన్ మన్యం కాలనీలోని పాఠశాల సమీపంలో రోడ్డు మార్జిన్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడం ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు రాకపోకలు సాగించేందుకు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వీటికి ఎటువంటి రక్షణ గోడలు లేకపోవడం, చిన్న పిల్లలకు సైతం అందే విధంగా విద్యుత్ వైర్లు కిందకు ఉండడం, సమీపంలోనే పాఠశాలలు ఉండడం ప్రమాదకరంగా నెలకొన్నాయి. భీమవరం పట్టణంలో పలు ప్రాంతాల్లో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి.

- ఏలూరు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)



ఆర్ఆర్ పేటలో డ్రెయిన్‌పై నీళ్లతొట్టె.. పక్కనే ట్రాన్స్‌ఫార్మర్లు..



ఏలూరు సీపీఎం రోడ్డులో రోడ్డు మార్జిన్‌లోనే ట్రాన్స్‌ఫార్మర్



మార్వాడీ గుడి వెనుకవైపు సందులో ట్రాన్స్‌ఫార్మర్



మస్తాన్ మన్యం కాలనీ సమీపంలో రోడ్డు మార్జిన్‌లోనే ట్రాన్స్‌ఫార్మర్



రామచంద్రరావుపేటలోని జీవీ మాల్ సమీపంలోని డ్రెయిన్‌పై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



బలుసులమ్మకు ఆషాఢం సారె

తాడేపల్లిగూడెం, జూలై 23(ఆంధ్రజ్యోతి) : పట్టణ ఇలవేలుపు బలుసులమ్మకు ఆషాఢం బుధవారం ఆషాఢం సారె అందించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దంపతులు పాల్గొన్నారు. రకరకాల పిండివంటలను తెచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆలయానికి కోలాట బృందం భజనలు చేస్తుంటే, డప్పు వాయిద్యాల నడుమ భక్తులు పెద్ద ఊరేగింపుగా చేరుకున్నారు. ఎమ్మెల్యే దంపతులు పట్టువస్త్రాలు ధరించి వేడుకగా అమ్మవారి ఆలయంలో భక్కులతో కలిసి అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలందరిపైనా అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరారు. రానున్న రోజుల్లో నిర్వహించే జాతర రాష్ట్రంలో మరెక్కడా జరగని విధంగా నిర్వహించాలని నిర్వాహకులకు, పట్టణ ప్రజలకు ఆయన సూచించారు.ఎమ్మెల్యే తనయుడు బొలిశెట్టి రాజేష్, ఆలయ నిర్వాహకులు శ్రీరంగా అంజి, సభ్యులు పాల్గొన్నారు.



ఉపాయం ఉంటే ఎంతటి పెద్ద పనైనా సులువుగా చేసేయొచ్చు.. ఇక్కడ ఈ రైతులు తమ ఐడియాతో ఈజీగా పెద్ద పైప్‌ను ఇలా తమ పొలానికి చేర్చారు..నిజానికి దీన్ని తీసుకు వెళ్లాలంటే పెద్ద వాహనం అవసరం అవుతుంది..కానీ వీళ్లు ఒకరికి ఒకరు ఇలా సాయం చేసుకుంటూ తమ పని సులువు చేసుకున్నారు. మొగల్తూరు మండలం పేరుపాలెం వద్ద కనిపించిన దృశ్యం.. - ఫొటోగ్రాఫర్, భీమవరం(ఆంధ్రజ్యోతి)

ఇంజనీరింగ్ నుంచి డైరెక్షన్ వైపు

తొలి ప్రయత్నంలోనే ఉత్తమ దర్శకుడిగా అవార్డు

షార్ట్ ఫిల్మ్ డైరెక్షన్‌లో కోపల్లె యువకుడు వంశీ ప్రతిభ



విశాఖ బీచ్ వద్ద షూటింగ్ చేస్తూ..

కాళ్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఒకవైపు విద్యలో రాణిస్తూ.. మరొకవైపు తాను అనుకున్న ఆశయ సాధనకు అడుగులు వేస్తూ తొలి ప్రయత్నంలోనే విజయం సాధించాడు.. కాళ్ల మండలం కోపల్లె గ్రామానికి చెందిన ఇందుకూరి రవివర్మ- విజయలక్ష్మి దంపతుల కుమారుడు వంశీకృష్ణంరాజు హైదరాబాద్ గీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం బీటెక్ కంప్యూటర్ సైన్స్ విద్యనభ్యసిస్తున్నాడు. చిన్ననాటి నుంచి చదువుతో పాటు సినిమాలపై ఆసక్తి ఉన్న వంశీ విభిన్నమైన రీతిలో ప్రేక్షకులకు మంచి సినిమాను చూపించాలనే ఆలోచనతో సొంతంగా ఒక కథ రాసుకున్నాడు. దీనికి తల్లిదండ్రుల ప్రోత్సాహం తోడవ్వడంతో కథకి కార్యరూపం ఇచ్చి షార్ట్‌ఫిల్మ్ చిత్రీకరించాడు. సుమారు సంవత్సరంపాటు అనేక అడ్డంకులను అధిగమించి ఈ ఏడాది మే నెలలో 'పర్వసం' లఘు చిత్రాన్ని పూర్తి చేశాడు. తర్వాత ఈ సినిమాను ఎలా ప్రజెంట్ చేయాలనే ఆలోచన వచ్చిన సమయంలో పరిచయం చేయడానికి ఉత్తమమైన వేదిక 'ఫిల్మ్ ఫెస్టివల్'గా భావించాడు. దాంతో ఫెస్టివల్స్ కోసం శోధించడం ప్రారంభించి ఈనెల 20వ తేదీన కోల్‌కతాలో జరిగిన 14వ అంతర్జాతీయ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించాడు. ప్రపంచ వ్యాప్తంగా సుమారు వెయ్యి మంది రష్యన్, ఇజ్రాయిల్, ఉక్రెయిన్, ఇంగ్లీష్, హిందీ తదితర భాషల్లో చిత్రాలను ప్రదర్శించగా 300 షార్ట్ ఫిల్మ్‌లు ఎంపిక చేశారు. వాటిలో 60 సినిమాలకు విభిన్న కేటగిరీల్లో అవార్డులు లభించాయి. ఈ క్రమంలో పెళ్లయిన ఏడాది తర్వాత ఒక వివాహిత జంట మధ్య సాగిన భావోద్వేగాలు, సంఘర్షణల కథ నేపథ్యంలో 'పర్వసం' టైటిల్‌తో తీసిన 50 నిమిషాల నిడివి గల తెలుగు షార్ట్ ఫిల్మ్‌కి ఉత్తమ దర్శకుడు- జ్యూరీ అవార్డును నిర్వాహకులు రాంభూల్ సింగ్, ప్రముఖ బెంగాల్ దర్శకుడు సుదీప్ రంజన్ సర్కార్ చేతుల మీదుగా వంశీ అందుకున్నాడు. ఈ లఘుచిత్రాన్ని 70 శాతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో, మిగిలిన 30 శాతం విశాఖపట్నం బీచ్‌లో తీసినట్లు తెలిపాడు.



తల్లిదండ్రులతో వంశీకృష్ణంరాజు

అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది : వంశీ కృష్ణంరాజు

తొలి చిత్రంలోనే ఉత్తమ దర్శకుడిగా ప్రముఖ బెంగాల్ డైరెక్టర్ సుదీప్ రంజన్ సర్కార్ చేతుల మీదుగా అందుకోవడం ఆనందంగా ఉంది. నా ఆసక్తిని గుర్తించి వెన్నంటి ప్రోత్సహించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్‌లో మంచి అర్థవంతమైన చిత్రాలు రూపొందించి, విభిన్నమైన కథలతో ప్రేక్షకుల మనస్సును తాకే విధంగా ఒక మంచి సినిమా తీయాలని మంచి దర్శకుడిగా సినిమా పరిశ్రమలో చోటు దక్కించుకోవాలన్నదే నా ఆశయం.

ఆదర్శం..రాంబాబు సేవలు

రోజుకు రెండు వందల మందికి క్యారేజీలు ఇవ్వడం మాటలు కాదు

సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన పి-4 గుర్తుకు వస్తోంది..

అభినందించిన కలెక్టర్ నాగరాణి



భోజనం రుచి చూస్తున్న పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తున్న తులసీ రాంబాబు సేవలు ముఖ్యమంత్రి చంద్రబాబు చేపట్టిన పి-4 గుర్తు చేస్తున్నాయి, సంపాదించిన దానిలో మానవ సేవకు ఖర్చు చేయడం ఎంతో గొప్ప విషయమని, గడిచిన ఐదు సంవత్సరాలుగా వృద్ధులకు, అచేతన స్థితిలో ఉన్న వారికి ప్రతినిత్యం ఆహారాన్ని అందించాలంటే ఎంతో దాతృత్వం కలిగి ఉండాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. వీరవాసరంలో తులసీ రాంబాబు చేస్తున్న అన్నదాన సేవలను కలెక్టర్ బుధవారం స్వయంగా పరిశీలించి వారి కుటుంబాన్ని అభినందించారు. ఆహార పదార్థాలను జిల్లా కలెక్టర్ స్వయంగా రుచి చూశారు. ఐదు సంవత్సరాలుగా ప్రతి రోజూ వీరవాసరం మండలంలోని 18 గ్రామాలలో సుమారు 200 మంది వృద్ధులకు, అచేతన స్థితిలో వుండి ఆహార పదార్థాలను వండుకోలేని పరిస్థితిలో ఉన్నవారికి రెండు పూటలకు సరిపడా క్యారేజీల ద్వారా ఆహారం అందజేస్తున్నట్లు రాంబాబు కలెక్టర్‌కు తెలిపారు. ప్రతి బుధవారం, ఆదివారం కాయగూరలతో పాటు, మాంసాహారం కూడా అందజేస్తున్నామన్నారు. వంటలు తయారు చేయడం, క్యారేజీలు కట్టడం, ఆటోలో తీసుకెళ్లి అందజేయడం మొత్తం ఈ పనులన్నింటికి ఐదుగురు సిబ్బంది నియమించినట్లు తెలిపారు. 200 మందికి భోజనాలు తయారు చేసి అందజేయడానికి సుమారు రోజుకు రూ. 8 వేల నుంచి 10 వేల వరకు ఖర్చవుతుందని, సంవత్సరానికి సుమారు రూ.30 లక్షల నుంచి రూ.35 లక్షల మధ్య ఖర్చు అవుతుందని, ఎవరి వద్ద విరాళాలు సేకరించకుండానే ఈ కార్యక్రమాన్ని ఐదు సంవత్సరాలుగా భగవంతుని దయతో నిరంతరాయంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పిలుపు మేరకు దాతృత్వం కలిగిన వ్యక్తులు మార్గదర్శకులుగా నమోదుకు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. వీరవాసరం తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీపీ వీరవల్లి దుర్గా భవాని, రాంబాబు సతీమణి వరలక్ష్మి, కుమార్తె గోవర్థిని, తండ్రి శ్రీరామమూర్తి తదితరులు ఉన్నారు.

విద్యుత్ కోతలు..జనం వెతలు

ఆదాయం కోల్పోతున్న చిరు వ్యాపారులు

విద్యుత్ హెచ్చు తగ్గులతో ఇబ్బందులు

పట్టించుకోని అధికారులు

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వేసవిని కూడా తలపించేలా విద్యుత్ కోతలు విధించడంతో ఉక్కిరి బిక్కిరవుతున్నారు. ఎప్పుడు ఉంటుందో ఎప్పుడు పోతుందో తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా గాలులు వీస్తే విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. కానీ ప్రస్తుతం పరిస్థితి అలా లేదు.కొంచెం వర్షం ప్రారంభమైందంటే చాలు వెంటనే కరెంట్ తీసేస్తున్నారు. అధికారికంగా విద్యుత్ తీస్తే ముందురోజే అధికారులు ప్రకటనల ద్వారా ప్రజలకు తెలియజేస్తారు. కాలం చెల్లిన ట్రాన్స్‌ఫార్మర్లతోనే ఇటువంటి సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తాడేపల్లిగూడెంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్

33/11 కేవీ లోనే ఎక్కువ సమస్యలు

తాడేపల్లిగూడెం జయలక్ష్మి థియేటర్ ఎదురుగా 33/11 కేవీ ఉంది. ఇక్కడ నుంచి కొంత భాగం తాడేపల్లిగూడెం పట్టణానికి, పెంటపాడు గ్రామానికి ఇక్కడి నుంచే విద్యుత్ ప్రసారం జరుగుతుంది. ప్రతీ సారి ఈ 33/11 కేవీలో సమస్యలు రావడం వల్లే తాడేపల్లిగూడెం నుంచి భీమవరం వైపు వెళ్ళే ప్రధాన రహదారిలో విద్యుత్ కోతలు ఎక్కువగా వస్తున్నాయి. ప్రధాన రహదారిపై గంటల తరబడి విద్యుత్ పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.రాత్రివేళలో అయితే సమస్య మరింత జఠిలంగా ఉంటుంది. ప్రధాన రహదారిపై ఉండే వీధి దీపాలు కూడా వెలగక పోవడంతో వినియోగదారులతో పాటూ వ్యాపారస్తులు కూడా ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు.

చిరు వ్యాపారుల పరిస్థితి దయనీయం

విద్యుత్‌నే నమ్ముకుని వ్యాపారాలు సాగించే చిన్న వ్యాపా రస్తులు కోతల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పిండి మిల్లు, వాటర్ సర్వీసింగ్, టైలరింగ్ తదితర వ్యాపారులు విద్యుత్ కోతల కారణంగా తమ ఆదాయాన్ని కోల్పో తున్నారు. వాస్తవానికి ఇటువంటి పరిస్థితి ఎక్కువగా వేసవి కాలం లోనే వస్తూంటుంది. కానీ వర్షాకాలమైనా గాని అనధికార విద్యుత్ కోతలు విధించడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు.వృద్ధులు, చిన్నారుల పరిస్థితి దయనీయంగా ఉంది.



పెంటపాడు కుమ్మరి పుంతలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కోసం కట్టిన సిమెంట్ దిమ్మ

విద్యుత్ హెచ్చుతగ్గులతో సమస్య

విద్యుత్త్ కోతలే కాదు ప్రతీ సారి అప్‌అండ్‌డౌన్ లో ఓల్టేజీ సమస్యలు వస్తున్నాయి. పెంటపాడు కుమ్మరి పుంత ఏరియాలో చాలా కాలం నుండి ఈ సమస్య ఉంది. ఎన్నిసార్లు విద్యుత్ అధికారులకు, సంబంధిత లైన్‌మేన్ కు ఈ విషయాన్ని అక్కడి స్థానికులు మొరపెట్టుకున్నా ఇప్పటికి సమస్య పరిష్కారం కాలేదు. ప్రతీసారి విద్యుత్త్‌లో హెచ్చు తగ్గుల కారణంగా తమ ఇంట్లో ఉన్న ఎలక్ట్రికల్ వస్తువులు కూడా పాడై పోతున్నాయని, తామందరం మధ్యతరగతి ప్రజలమని వస్తువులు పోతే కనీసం కొనుక్కునే స్థితిలో కూడా లేమని అక్కడి స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్త్‌లో హెచ్చు తగ్గుల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

హెచ్చుతగ్గుల సమస్యతో ఇబ్బంది : దుర్గ (పెంటపాడు)



విద్యుత్ కోతల కారణంగా చాలా ఇబ్బందులు పడుతున్నాం . ముఖ్యంగా మా ప్రాంతంలో విద్యుత్ హెచ్చు తగ్గుల సమస్య ఎక్కువగా ఉంది. ఇప్పటికే స్థానిక నాయకులకు, అధికారులకు అనేకసార్లు చెప్పాం. అయినా సమస్య పరిష్కారం కాలేదు. అధికారులు స్పందించి మా సమస్యను పరిష్కరించాలి

మరో ట్రాన్స్‌ఫార్మర్ వేయాలి: అన్నపూర్ణ (పెంటపాడు)



మా ప్రాంతంలో విద్యుత్ సమస్య ఎప్పటి నుంచో ఉంది. నేటికి పరిష్కారం కాలేదు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వేయడానికి అధికారులు సిమ్మెంట్ దిమ్మను కూడా నిర్మించారు. కానీ టాన్స్‌పార్మర్ మాత్రం ఇప్పటి వరకూ వేయలేదు. కొత్త ట్రాన్స్ ఫార్మర్ వేస్తే గాని మా ప్రాంతంలో విద్యుత్ సమస్య పరిష్కారం అవ్వదు.



గోపన్నపాలెంలో ఉన్న అగ్రిటెస్టింగ్ ల్యాబ్

లక్ష్యానికి దూరంగా అగ్రి ల్యాబ్

- రెండేళ్లలో 102 శాంపిల్స్‌తో సరి
- యంత్ర సామాగ్రి, సిబ్బంది కొరతే

దెందులూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : లక్షలాది రూపాయలతో దెందులూరు నియోజకవర్గంలోని గోపన్నపాలెంలోని సీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అగ్రి ల్యాబ్ లక్ష్యానికి దూరంగా ఉంది. మూడు శాఖల ద్వారా ఆయా వర్గాల రైతులకు సేవలందించాల్సి ఉండగా, కేవలం వ్యవసాయ, పశుసంవర్థ శాఖల సిబ్బంది ల్యాబ్ టెస్టులకే పరిమితం అయ్యారు. మత్స్యశాఖ శాంపిల్స్ ఊసేలేదు. అదీ కూడా పూర్తిస్థాయిలో రైతులకు సేవలందటం లేదన్న ఆరోపణలున్నాయి. 2023 సంవత్సరం జూలై ఏడో తేదీన రూ.65 లక్షల నాబార్డు నిధులతో ఆర్‌కేవీవై పథకంలో డాక్టర్ వైఎస్ఆర్ అగ్రి టెస్టింగ్‌ల్యాబ్ (నియోజకవర్గ స్థాయి పశువ్యాధి నిర్ధారణ ప్రయోగ శాల) కింద సేవలందించడం ప్రారంభించారు. సరిగ్గా రెండేళ్లు అవుతున్నా ఇప్పటికీ కూడా రైతులు పంటల వినియోగంలో వాడే వివిధ రకాల ఎరువుల నాణ్యత పరీక్షించే యంత్రాలు, సిబ్బంది పూర్తిస్థాయిలోకి అందుబాటులో రాలేదు. దీంతో రైతులు తమ పంటలకు వేసే పురుగుమందులు నాణ్యమైనవో లేదా నకిలీవో తెలియక గందరగోళంలో కొట్టుమిట్టాడుతున్నారు. విత్తనం మంచిదైతే పంట బాగా పడుతుందని రైతుల నమ్మకం. అయితే మార్కెట్‌లోకి వచ్చే విత్తనాలతో పాటు, రైతులు సాగే చేసే విత్తనాల నాణ్యత పరీక్షించుకునే అవకాశం ఉన్నప్పటికీ సరైన ప్రచారం లేకపోవడంతో స్థానికంగానే రైతులు వేసే వరి వంగడాల శాంపిల్స్ పరీక్షలకు పెద్దగా రావడం లేదు. ప్రారంభించిన రెండేళ్ల నాటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 102 పరీక్షలకు మాత్రమే శాంపిల్స్ వచ్చినట్లు అక్కడ సిబ్బంది చెబుతున్నారు. దెందులూరు నియోజకవర్గ పరిధిలో దెందులూరు, పెదపాడు, పెదవేగి, ఏలూరు రూరల్ మండలాల మీద 50 వేల ఎకరాల పైబడి పంటలు సాగు చేస్తుండగా, ఇందులో అగ్రభాగం వరితో పాటు అక్కడక్కడ మొక్కజొన్న సాగు చేస్తున్నారు. రైతులకు కీలకమైన వరి విత్తనాలు, అన్ని రకాలు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు నాణ్యత పరీక్ష చేయాల్సి ఉన్నప్పటికీ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లో సిబ్బంది కొరత, యంత్రాల కొరత వలన కేవలం విత్తనాల శాంపిల్స్ పరీక్షలకు పరిమితం అవడంపై రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఈ నియోజకవర్గంలో వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ ఉన్నప్పటికీ పశువ్యాధి నిర్ధారణ పరీక్షల ప్రయోగశాల సేవలు నామమాత్రంగా ఉన్నాయి. నియోజకవర్గం మొత్తం మీద లక్షకు పైగా పశు సంపద ఉండగా, ఈ ల్యాబ్‌లో పశువుల మలం, రక్తనమూనా, చర్మ, నాజిల్, బయోకెమికల్, పాలు సంబంధించి శాంపిల్స్ పరీక్షలు చేయాల్సి ఉంది. కేవలం ఈ రెండేళ్లలో 2,380 మాత్రమే పరీక్షలు నిర్వహించారు.

మత్స్యశాఖ పరీక్షలు లేనే లేవు

నియోజకవర్గస్థాయి పరిధిలో ఎంతో ఆర్భాటంగా మూడు శాఖల పరీక్షలని చెప్పి ప్రారంభించినప్పటికీ, మత్స్యశాఖ పరీక్షలు ఈ కేంద్రంలో ఇప్పటి వరకు జరగలేదు. సమస్య ఏమిటని ఆరా తీస్తే దెందులూరు నియోజకవర్గ పరిధిలో మత్స్యశాఖ రైతులు తక్కువగా ఉన్నారని, కేంద్రానికి రావడం లేదని కుంటిసాకులు చూపుతున్నారు. ఈ కారణం చూపించి ఇక్కడ సిబ్బంది, యంత్రాలను ఏర్పాటు చేయాల్సిన ఉన్నప్పటికీ అధికారుల నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సిబ్బంది, యంత్రాలను ఏర్పాటు చేసి అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను పూర్తిస్థాయిలో వినియోగించునే విధంగా చూడాల్సిన అవసరం ఉంది.

ఏఎన్ఎంలకు సర్వే కష్టాలు

సర్వర్ సమస్యలతో సతమతం

ఓటీపీలు చెప్పేందుకు భయపడుతున్న జనం



లింగపాలెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సాధారణ కార్యక్రమాలతో పాటు వివిధ రకాల ప్రభుత్వ సర్వేలన్నీ తమకే అప్పచెపుతుండటంతో తమపై పనిభారం పెరుగుతోందంటూ ఏఎన్ఎంలు (ఆరోగ్యకార్యకర్తలు) ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏఎన్ఎంలు తమ సాధారణ విధుల్లో భాగంగా తమకు కేటాయించిన గ్రామాల్లో ప్రతిరోజూ గర్భిణులను గుర్తించి వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చెయ్యడం, బాలింతలకు ఆరోగ్యపరీక్షలు, టీకాలు, 104 సిబ్బందితో కలసి వైద్య శిబిరాలలో పాల్గొనటం, కిషోరీ వికాసం వంటి పలు కార్యక్రమాలలో పాల్గొనటం చేస్తున్నారు. వీటితో పాటు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చేపట్టే పలు సర్వేలు, పింఛన్ల పంపిణీ కూడా వీరికి అప్పగించడంతో పని ఒత్తిడితో సతమతమవుతున్నారు. దీనికితోడు గ్రామీణ ప్రాంతాలలో సరైన సిగ్నల్స్ అందక మొబైల్‌సర్వర్లు మొరాయిస్తుండటంతో ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇదిలా వుంటే గ్రామాల్లో అసంక్రమిత వ్యాధులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను గుర్తించేందుకు ఎన్‌సీడీ సర్వే, ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన, ఆరోగ్య బీమా, హెల్త్‌కార్డులు అందించేందుకు సర్వేలు చేపట్టాలని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ఆదేశాల మేరకు చేస్తున్న సర్వేలకు అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో వీరికి సరైన సమాచారమిచ్చేందుకు, సైబర్ నేరాల భయంతో తమ సెల్‌ఫోన్‌లకు వచ్చే ఓటీపీలు చెప్పేందుకు ప్రజలు భయపడుతున్నారు. లబ్ధిదారుల ఆధార్ కార్డులకు ఫోన్ నెంబర్ లింక్ కాకపోవడం, వేలిముద్రలు పడకపోవడంతో పాటు ఆన్‌లైన్‌లో వివరాల నమోదు సమ యంలో సర్వర్ మొరాయిస్తుండటంతో గంటల కొద్దీ సమయం పడుతుందని, సర్వే పూర్తి చేసేందుకు తాము అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సర్వే ఆలస్యమైతే అధికారులు మెమోలు ఇచ్చేందుకు కూడా వెనుకాడటం లేదని ఏఎన్ఎంలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చివటంలో ప్రభుత్వ పనితీరును అడిగి తెలుసుకుంటున్న మంత్రి రవికుమార్, చిత్రంలో బూరుగుపల్లి శేషారావు

అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు

మంత్రి గొట్టిపాటి రవికుమార్

ఉండ్రాజవరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో అర్హులైన ప్రతిఒక్కరికీ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఉండ్రాజవరం మండలంలోని చివటం గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో కరెంట్ ఫ్యూజ్ బాక్సులు కిందకు ఉన్నాయని ప్రజలకు అందకుండా పైకి ఏర్పాటు చేయాలని ఒక మహిళ తెలిపారు. వెంటనే వాటిని ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. గ్రామంలో చెత్తను నివాసాలకు దగ్గరగా వేస్తున్నారని, వాటిని దూరంగా వేయాలని కొందరు మహిళలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. స్థల సేకరణచేసి చెత్తను అక్కడి నుంచి తరలించాలని మంత్రి తహసీల్దార్ ప్రసాద్‌ను ఆదేశించారు. అనంతరం గ్రామపంచాయతీ వద్ద జరిగిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పింఛన్లు పెంచిన ఘనత దేశంలోనే ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. మండలంలో రైతులు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని కోరారని, వీటిని త్వరలో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్ర స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించిందన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్ఐడీసీ ఛైర్మన్ మంతెన రామరాజు, నియోజవర్గ పరిశీలకుడు డీవీ సత్యనారాయణ, నిడదవోలు పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, ఉండ్రాజవరం మండల టీడీపీ అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, పెరవలి మండల అధ్యక్షుడు అతికాల శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు వి.సత్యనారాయణ, ఏఎంసీ ఛైర్మన్ గాలింకి జిన్నాబాబు, గ్రామటీడీపీ అధ్యక్షుడు చిలుకూరి శ్రీను, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు వెలిచేటి ప్రసాద్, ముళ్లపూడి పాండురంగ, ఈర్పిన సత్యనారాయణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేతన సవరణ వెంటనే అమలు చేయాలి

పశ్చిమ గోదావరి జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ విజయ రామరాజు

పాలకోడేరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : 12వ వేతన సవరణ అమలుకు కమిషన్ నియమించాలని, మధ్యంతర భృతి వెంటనే మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం, పాత బకాయిలు వెంటనే విడుదల చేయాలని పశ్చిమ గోదావరి జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ పీఎస్ విజయ రామరాజు, సెక్రటరీ జనరల్ జి.ప్రకాశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనికి సంబంధించి బుధవారం పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ 2023 జూలై నెల నుంచి ఉద్యోగులకు వేతన సవరణ జరగాల్సి ఉందని, రెండేళ్ళు గడిచినా ఇంత వరకు దాని గురించి ప్రభుత్వం ఆలోచన చేయడం లేదని, అందువల్ల తక్షణమే 12వ వేతన సవరణ కమీషన్ ఏర్పాటు చేయవలసినదిగా డిమాండ్ చేశారు. 2023 జూలై నెల నుంచి ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేసి, 2003 ముందు నియామకం పొందిన వారికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో నెంబర్ 57ను అమలు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. బదిలీలు పొందిన ఉపాధ్యాయులకు ఇంకనూ పొజిషన్ ఐడీలు లేక జీతాలు అందలేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఈ సమస్యను ప్రభుత్వం పరిష్కరించి వారికి జీతాలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కో-ఛైర్మన్ సాయివర్మ, డిప్యూటీ సెక్రటరీ జనరల్ వెంకటేశ్వరరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వైసీపీ నాయకులు

సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయడంపై వైసీపీ ధర్నా

పోడూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పండితవిల్లూరు సర్పంచ్ ఇళ్ల లక్ష్మీచంద్రిక చెక్ పవర్ రద్దుపై పోడూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద నియోజకవర్గంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వైసీపీ నాయకులు ధర్నా నిర్వహించారు. జడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు మాట్లాడుతూ టీడీపీ నాయకుల ప్రమేయంతోనే సర్పంచ్ చెక్ పవర్ అధికారులు రద్దు చేశారని ఆరోపించారు. అధికార పార్టీ నాయకులకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. సర్పంచ్ చెక్ పవర్‌ను పునరుద్ధరించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవోకి వినతిపత్రం అందచేశారు. వైసీపీ నాయకులు పిల్లి నాగన్న, గుబ్బల వీరబ్రహ్మం ఎంపీపీలు,జడ్పీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

టీడీపీకి సంబంధం లేదు



సర్పంచ్ లక్ష్మీచంద్రిక 2022 నుంచి వైసీపీ ప్రభుత్వ హయాంలోనే పంచాయతీ నిధులు దుర్వినియోగానికి పాల్పడిందన్న ఫిర్యాదుపై అధికారులు విచారణ చేసి ఆమె చెక్కు పవర్‌ను రద్దు చేశారనీ దీనిలో టీడీపీకి ఎటువంటి సంబంధం లేదని అనవసరంగా బురద జల్లే ప్రయత్నం చేయవద్దంటూ టీడీపీ నాయకులు అన్నారు. పండిత విల్లూరు పంచాయతీ కార్యాలయంలో బుధవారం విలేఖర్ల సమావేశంలో పంచాయతీ వార్డు సభ్యులు నామాల పణీంద్ర, నెక్కంటి శివదుర్గ నాగేశ్వరరావు, ఆళ్ల సత్యవతితో పాటు మాజీ సర్పంచ్ కొరిపల్లి రామచంద్రరావు, టీడీపీ నాయకులు గణపతినీడి రాంబాబు, రామకృష్ణ, కుక్కల వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు.

ఆశ్రంలో బీఎస్సీ హెల్త్ సైన్స్‌పై అవగాహన

ఏలూరు, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఆశ్రం మెడికల్ కాలేజీకి అను సంధానమైన ఆశ్రం కాలేజీ ఆఫ్ ఎలైడ్ హెల్త్ సైన్సెస్‌లో ఇంటర్మీడియట్ బైపీసీ పూర్తి చేసిన విద్యార్థులకు బీఎస్సీ ఎలైడ్ హెల్త్ సైన్సెస్ కోర్సులపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు హాస్పిటల్ యాజమాన్యం తెలిపింది. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 25, 26వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల సమయంలో ఇన్‌స్టిట్యూట్‌కి వచ్చి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని వివరించారు. మరిన్ని వివరాలకు 73826 26293 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్యాస్ కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. గడిచిన ఏడాది కాలంలో అంగన్‌వాడీ కేంద్రాల పటిష్టతపై పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. తాజాగా గ్యాస్ సిలిండర్ల సమస్యను అధిగమించేందుకు విద్యుత్ సాయంతో నడిచే ఇండక్షన్ స్టవ్‌లు ఇవ్వనున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

అంగన్‌వాడీల్లో గ్యాస్ కష్టాలకు చెక్

- 3 అర్బన్ ప్రాజెక్టులకు ఇండక్షన్ స్టవ్‌లు
- పైలట్ ప్రాజెక్టుగా 405 సెంటర్లకు కేటాయింపులు
- ప్రజాప్రతినిధులు చేతుల మీదగా త్వరలో అందజేత



ఏలూరు జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా మొత్తం 405 ఇండక్షన్ స్టవ్‌లు, వంటలు చేసేందుకు నాలుగు కాపర్ కోటెడ్ వంటపాత్రలు రాష్ట్ర కార్యాలయం నుంచి జిల్లా ప్రాజెక్టు కార్యాలయానికి చేరుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా 2225 అంగన్‌వాడీ కేంద్రాలకు గాను ఏలూరు సీడీపీవో ప్రాజెక్టు పరిధిలో 205 కేంద్రాలకు, జంగారెడ్డిగూడెం ప్రాజెక్టుకు 83, నూజివీడుకు 117 స్టవ్‌లు, పాత్రలు చేరుకున్నాయి. వీటిని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల చేతుల మీదుగా అంగన్‌వాడీ సెంటర్లకు పంపిణీ చేయనున్నారు. ముందుగా వీటి వినియోగంపై అంగన్‌వాడీ సిబ్బంది ఆయ కంపెనీల ప్రతినిధులు శిక్షణ ఇవ్వనున్నారు. అందులో భాగంగా వంటలకు ఉపయోగించే గ్యాస్ ఆధారిత పొయ్యిల స్థానంలో విద్యుత్ సాయంతో నడిచే ఇండక్షన్ స్టవ్‌లను అందివ్వనుండటంతో సిలెండర్ల బిల్లులు ఎదురు చూపులు కష్టాలు అంగన్‌వాడీకు తగ్గాయి.

భవిష్యత్‌లో సోలార్‌తోనే వంటలు..

పైలట్ ప్రాజెక్టుగా మూడు నగరాలు, పట్టణాల్లో ఇండక్షన్ స్టవ్‌లను వినియోగించాక.. ఆ తదుపరి జిల్లా అంతటా విస్తరిస్తారు. ప్రధానంగా గ్యాస్ సిలిండర్ అయిపోతే పిల్లల వంటకు పడే కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఈ బిల్లులు బడ్జెట్ ప్రకారం విడుదల కానుండటంతో నెలలు తరబడి పెండింగ్‌లో ఉండటంతో సిబ్బంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో గ్యాస్ సరఫరా కాకపోవడం, ఇతర ఇబ్బందులు దృష్ట్యా వీటిని పంపిణీ చేస్తోంది. ఇప్పటి వరకు ఏజెన్సీల నుంచి గానీ, ప్రైవేట్ వ్యక్తులు గానీ కేంద్రాలకు సిలిండర్లను సరఫరా చేసేవారు. వారికి ప్రభుత్వం నేరుగా నగదు జమ చేసేది. గత ప్రభుత్వ హయాంలో బకాయిలు ఉండ డంతో చాలా మంది ముందుకు రాక.. సకాలంలో వంట పూర్తయ్యేది కాదు. ఆ కష్టాలు ఇక దూరం కానున్నాయని అంగన్‌వాడీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.. కాగా రాబోయే రోజుల్లో సోలార్‌తో ఇండక్షన్ స్టవ్‌లు వినియోగంపైన ప్రభుత్వం దృష్టి సారించిందని చెబుతున్నారు. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో సోలార్‌పై విస్తృత ప్రచారం జరుగుతోంది. అందులో భాగంగానే సోలార్ వినియోగం కూడా అంగన్‌వాడీల్లో విస్తరించే యోచన ఉంది. ఇది గ్రామాల్లో అమలు చేస్తారా? అనే చర్చ సాగుతోంది. దీని వల్ల పర్యావరణ పరంగాను, ఆరోగ్యపరంగా ఉపయుక్తమే.



నూగొండపల్లిలో సిద్ధంగా ఉంచిన మట్టి గుట్టలు

సాయిల్.. ఎనీటైం ఫర్ సేల్!

నూజివీడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అనుమతించిన ఇసుక ర్యాంపు కాదు ఇది. ఎలాంటి అనుమతులు లేని సాయిల్ ర్యాంప్. వర్షాలు ప్రారంభం కావడంతో చెరువుల్లో మట్టి తవ్వకాలకు ఇబ్బంది కాబట్టి ముందుగానే చెరువుల నుంచి మట్టిని అక్రమంగా తోలి సమీపంలోని ఒక పొలంలో పెద్దగుట్టుగా పోసి ఎనీ టైం సాయిల్ అమ్మకానికి కొందరు అధికార పార్టీ నేతలు ఏర్పాటు చేసిన సాయిల్ డెన్ ఇది. సాయిల్‌ను ఇలా అక్రమంగా గుట్టలుగా పోయడానికి అనుమతులు ఉండవు. మట్టి తవ్వకాలు, అమ్మకాలలో లాభం రుచిచూసిన ఈ మట్టి మాఫియా వర్షాలు పడినా తమ వ్యాపారానికి ఎలాంటి విరామం లేకుండా మట్టిని గుట్టలుగా పోసి అమ్ముకుంటున్నారు. ఆగిరిపల్లి మండలం నూగొండపల్లి గ్రామ పరిధిలోని చెరువులోని మట్టిని పక్కనే ఒక పొలంలో ఇలా గుట్టలుగా పోసి ఉంచారు. అలాగే కొత్త ఈదర గ్రామంలోని చెరువు మట్టిని అక్కడే ఒక పక్కన గుట్టలుగా పోసి రెడీ ఫర్ సేల్‌కు ఉంచారు. ఇవేకాదు నూజివీడులోని కొన్ని గ్రామాలు, ముసునూరు మండలంలోని చిల్లబోయినపల్లి గ్రామంలోనూ అక్రమ మట్టి తవ్వకాలు గంటకు మూడు ట్రాక్టర్లు ఆరు టిప్పర్లుగా సాగుతున్నాయి. ఈ సాయిల్ డెన్‌లు అధికారులకు కనబడితే ఒట్టు. ఈ మట్టి గుట్టల గురించి బుధవారం ఆగిరిపల్లి తహసీల్దార్‌కు రాతపూర్వక ఫిర్యాదు అందింది. ఏం జరుగుతుందో చూడాలి.

చెప్పులు, చీపుళ్లతో తిరగబడతారు..

- టీడీపీ ముసుగులో వైసీపీ గూండాల అరాచకం
- సహించేది లేదన్న ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీవీ



విలేకరులతో మాట్లాడుతున్న ఏబీ వెంకటేశ్వరరావు

నూజివీడు, జూలై 23(ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలం ముక్కొల్లుపాడులో టీడీపీ ముసుగులో వైసీపీ గూండాల అరాచకాలను సహించేది లేదని ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. బుధవారం నూజివీడు వెలుగు కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముక్కొల్లుపాడులో డ్వాక్రా బుక్ కీపర్ పద్మ అనే బీసీ మహిళను అక్రమంగా తొలగించడానికి అధికార పార్టీ ముసుగులో ఈ వైసీపీ నాయకులు ప్రయత్నించడమే కాక ఆమెకు మద్దతుగా ఉన్నవారిపై దాడులు చేస్తుండటంతో ముక్కొల్లుపాడు గ్రామస్థుడిగా ఈ అన్యాయాన్ని సహించలేక తాను అధికారులను కలిసి పరిస్థితిని వివరించి నిబంధనలు పాటించమని కోరడానికి వెలుగు కార్యాలయానికి, నూజివీడు రూరల్, పట్టణ పోలీస్ స్టేషన్‌లకు వచ్చినట్లు తెలిపారు. పద్మ కుటుంబం టీడీపీ సానుభూతిపరులు కావడంతో వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన ఈ గ్రామ నాయకులు గతంలో తమకు వ్యతిరేకంగా వ్యవహరించిన పద్మను వేధించటానికి ఇప్పుడు అధికార పార్టీ ముసుగు వేసుకొని ఆమెను తొలగించడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఆమెకు మద్దతుగా ఉన్న వారిపై దాడులు చేయడమే కాక ఆమె నుంచి రికార్డులను సైతం దొంగలించడానికి ప్రయత్నాలు చేశారని వీటిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు చర్యలు తీసుకోకపోవడంతో తాను సంబంధిత అధికారులను కలిసి నిబంధనలను పాటించి న్యాయం చేయాలని కోరినట్లు వివరించారు. టీడీపీలోకి వచ్చిన ఈ ముఠా గ్రామంలో రోజుకో కేసు పెడుతూ ప్రశాంతతను పాడు చేస్తోందన్నారు. ఈ ముఠా వెనుక గ్రామంలో పాత పెత్తందారులు ఉన్నారన్నారు. పరిస్థితి మారకపోతే గ్రామంలో మహిళలు చెప్పులు, చీపుళ్లతో వీరి భరతం పడతారన్నారు. పార్టీ మారినంత మాత్రాన ఆబోతులు ఆవులు కావన్నారు. తొలుత ఏబీ వెంకటేశ్వరరావు వెలుగు కార్యాలయం సీసీ కుమారితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తనకు బుక్ కీపర్‌ను తొలగించే అధికారం లేదని ఆమె సమాధానం చెప్పడంతో నిబంధనలు పాటించి అందరినీ సమావేశపరిచి మెజార్టీ సభ్యుల అభిప్రాయాల ప్రకారం నడుచుకోవాలని ఆమెను కోరారు. కాగా కొత్త రావచర్లకు చెందిన కే లక్ష్మీసుజాత అనే మరో బుక్ కీపర్ తనపై సభ్యులు ఎలాంటి ఫిర్యాదులు చేయకపోయినా తనను తొలగించాలని గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఒత్తిడి చేస్తున్నారని తన పనులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తాను కోర్టుకు వెళ్ళి స్టే తెచ్చుకొన్నా తనను విధుల్లోకి తీసుకోవడం లేదని ఆమె ఏబీవీకి, విలేకరులకు తెలిపారు. దీనిపై సీసీ కుమారిని వివరణ కోరగా ఆమెను బుక్‌కీపర్‌గా తొలగించలేదని ఆమె స్థానంలో మరొకరు పని చేస్తున్న విషయం తనకు తెలియదన్నారు. త్వరలో సభ్యులందరినీ సమావేశపరిచి నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకుంటామని ఏబీకి తెలిపారు. అక్కడ నుంచి ఆయన నూజివీడు రూరల్, టౌన్ పోలీస్ స్టేషన్లలో ఎస్ఐలను కలసి పద్మ దగ్గర నుంచి రికార్డులు అపహరించడానికి ప్రయత్నించిన కేసు దర్యాప్తు ఎంత వరకు వచ్చిందని తెలుసుకున్నారు. అలాగే గ్రామంలో సదరు మహిళలను వెలుగు కార్యాలయానికి ఫిర్యాదు చేయడానికి తీసుకువచ్చిన ఆటో డ్రైవర్‌పై ఈ ముఠా చేసిన దాడిలో గాయపడ్డ వ్యక్తి పెట్టిన కేసు దర్యాప్తు ఎంత వరకు వచ్చిందని అడిగి, నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి ఎవరి తప్పుంటే వారిపై కేసు నమోదు చేయాలని పోలీస్ అధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు.



భీమవరంలో విలేకరులతో మాట్లాడుతున్న దర్శకుడు రవీందర్

యథార్థ ఘటనే..

రాజు గాని సవాల్

ఏలూరు రూరల్/భీమవరం టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): లెలిజాల రవీందర్ కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'రాజు గాని సవాల్' చిత్ర ప్రమోషన్‌లో భాగంగా బుధవారం భీమవరం ఏవీజీ స్ర్కీన్‌లో, సాయంత్రం ఏలూరు సత్యనారాయణ థియేటర్లో విలేకరులతో కథానాయకుడు రవీందర్ మాట్లాడారు. తన జీవితంలో జరిగిన కొన్ని ఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించామన్నారు. కల్చరల్ ఈవెంట్స్ నేపథ్యంలో కథ సాగుతుందని, ప్రేక్షకులకు వినోదంతో పాటు మంచి సందేశం ఇచ్చే చిత్రమన్నారు. ఇద్దరు హీరోయిన్స్ సంధ్య రాథోడ్, రితికా చక్రవర్తి నటిస్తున్నారని, ప్రతి పాటా అందరికీ నచ్చుతుందని, ఇప్పటికే విడుదలైన సినిమా టీజర్, ట్రైలర్, పాటలకు అద్భుత స్పందన వస్తోందన్నారు. వచ్చే నెల 8న ఈ చిత్రం విడుదల చేస్తున్నామని, ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. హీరోయిన్ రితికా చక్రవర్తి మాట్లాడుతూ ఈ చిత్రం అన్ని వర్గాల ప్రజలకూ నచ్చుతుందన్నారు. పవన్ కల్యాణ్ నూతన చిత్రం హరిహర వీరమల్లు చిత్రంలో ఈ చిత్ర ట్రైలర్ వస్తుందని అన్నారు. బాపిరాజు, రాజేష్, సత్యనారాయణ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

భార్యను హతమార్చిన 85 ఏళ్ల భర్త అరెస్టు

ఏలూరు క్రైం, జూలై 23(ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో కట్టుకున్న భార్యను విచక్షణా రహితంగా కర్రతో కొట్టి హతమార్చిన బొబ్బా లక్ష్మణరావు(85)ను ఏలూరు త్రి టౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పెదపాడు మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన బొబ్బా లక్ష్మణరావు, బొబ్బా రంగమ్మ(75)కు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలు ఏలూరు శ్రీరామ్‌నగర్‌లో ఒకేచోట ఉంటున్నారు. స్వగ్రామంలో ఒంటరిగా ఉంటున్న వృద్ధతల్లిదండ్రుల ఆలనాపాలన చూసుకోవాలను ఉద్దేశంతో శ్రీరామ్‌నగర్‌లోనే ఒక ఇల్లు అద్దెకు తీసుకుని ఉంచారు. వారి వద్ద పని చేయడానికి ఒక మహిళను కూడా ఏర్పాటు చేశారు. ఈ ఏడాది జూన్ 15న లక్ష్మణరావుకు, రంగమ్మకు గొడవ జరిగింది. దీంతో లక్ష్మణరావు ఆగ్రహంతో మంచంపై పడుకున్న రంగమ్మను కర్రతో విచక్షణారహితంగా దాడి చేయడంతో అక్కడికక్కడే మరణించింది. ఈ సంఘటనపై ఏలూరు త్రి టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. లక్ష్మణరావుకు గతంలోనే ఎడమ కాలు సగంపైనే తీసివేశారు. ఇంటిలో చక్రాల బండిపైనే ఉంటాడు. హత్య కేసులో లక్ష్మణరావును బుధవారం త్రిటౌన్ సీఐ వి.కోటేశ్వరరావు అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు.

బావను హతమార్చిన బావమరిదికి జీవితఖైదు

ఏలూరు క్రైం, జూలై 23(ఆంధ్రజ్యోతి): అక్కను తన కళ్లముందే బావ కొట్టాడనే కోపంతో మేదర కత్తితో వెంటబడి తలనరికి హతమార్చినట్టు నేరం రుజువుకావడంతో జీవిత ఖైదు, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ ఏలూరులోని రెండవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి యు.ఇందిరా ప్రియదర్శిని బుధవారం తీర్పు చెప్పారు. విజయవాడలోని సింగ్‌నగర్ న్యూ రాజేశ్వరిపేటలో నివాసం ఉంటున్న పవర్ రాజేష్(31)కి భార్య పవర్ ఎల్లమ్మ(30)ఒక కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎల్లమ్మ చెల్లి నందిని భర్త మరణించడంతో రాజేశ్ నందినీతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం ఎల్లమ్మకు తెలిసి ఏలూరు రూరల్ మండలం వెంకటాపురం పంచాయతీ సెంచుల కాలనీలో ఉన్న తన సోదరుడు తంగా పాండ్యన్ అలియాస్ బంగారం (27) వద్దకు వచ్చి ఉంటూ చెత్త కాగితాలు ఏరుకుంటూ తన పిల్లలను పోషించుకుంటోంది. 2021 మే నెల 20వ తేదీ ఉదయం విజయవాడ నుంచి రాజేష్ ఎల్లమ్మ వద్దకు వచ్చి తనతోపాటు వచ్చేయాలని కోరాడు. దీనికి ఆమె నిరాకరించడంతో కొట్టాడు. దీంతో ఆగ్రహించిన ఎల్లమ్మ సోదరుడు తంగా పాండ్యన్ మేదర కత్తితో రాజేష్‌ను నరికాడు. దీంతో రాజేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై అప్పటి ఏలూరు రూరల్ ఎఎస్ఐ కె.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేయగా అప్పటి రూరల్ సీఐ ఎ.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేసి హంతకుడైన పాండ్యన్‌ను అరెస్టు చేశారు. ఈ కేసు ఏలూరులోని రెండవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో విచారణ సాగింది. తంగా పాండ్యన్‌పై నేరం రుజువు కావడంతో రెండవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి యు.ఇందిరా ప్రియదర్శిని బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఎపీపీ చింతమనేని రమేష్ వాదించగా ప్రాసిక్యూషన్‌కు కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో హెడ్‌కానిస్టేబుళ్ళు నాగేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, ఏలూరు వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ, ఏలూరు రూరల్ ఎస్ఐ దుర్గా ప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ నాగేంద్ర కుమార్, హోంగార్డు రవి రాజులు సహకరించారు.

బాలికపై అత్యాచారయత్నం.. పోక్సో కేసు నమోదు

భీమవరం క్రైం, జూలై 23(ఆంధ్రజ్యోతి): రెండవ తరగతి చదువుతున్న ఎనిమిదేళ్ల బాలికపై యువకుడు అత్యాచార యత్నం చేసిన దారుణ ఘటన భీమవరం పట్టణంలో చోటు చేసుకుంది. చిన్న చిన్న పనులు చేసుకుంటూ ఒక కుటుంబం పట్టణంలో జీవనం సాగిస్తోంది. వారికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. పట్టణానికి చెందిన కారెం తేజ(26) అనే యువకుడు బాలికపై కన్నేశాడు. ఈ నేపథ్యంలో బుధవారం తెల్లవారు జామున 2 గంటల సమయంలో ఆ బాలిక ఉంటున్న గదిలోకి ప్రవేశించి కేకలు వేస్తే చంపేస్తానంటూ భయపెట్టి అత్యాచార యత్నానికి ప్రయత్నించాడు. భయపడిన బాలిక కేకలు వేయడంతో ఆ యువకుడు పారిపోయాడు. అనంతరం బాలిక భయపడుతూ తల్లిదండ్రులకు జరిగిన విషయం చెప్పింది. ఈ ఘటనపై తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించగా యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కృష్ణాజీ తెలిపారు. ప్రస్తుతం ఆ యువకుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

పొలం కోసం భార్యను హతమార్చి..



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

ఏలూరు క్రైం, జూలై 23(ఆంధ్రజ్యోతి): తమకు ఉన్న 33 సెంట్ల పొలం (చెరువు)ను విక్రయించడానికి భర్త ప్రయత్నించగా అడ్డుపడుతున్న భార్యను అతి కిరాతకంగా కత్తితో నరికి హతమార్చిన భర్తను ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో కైకలూరు రూరల్ సీఐ వీరా రవి కుమార్ అరెస్టు చేశారు. బుధవారం రాత్రి ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్ కేసు వెల్లడించారు. కలిదిండి మండలం కట్టావానిపాలేనికి చెందిన కట్టా పెద్దిరాజు (48)కి భార్య జయలక్ష్మి (44) పిల్లలు ఉన్నారు. వీరికి ఉన్న 33 సెంట్ల పొలాన్ని విక్రయించడానికి భర్త పెద్దిరాజు ప్రయత్నిస్తుండగా భార్య జయలక్ష్మి అడ్డుపడుతోంది. దీంతో ఈ నెల 10న తెల్లవారు జామున నిద్రిస్తున్న జయలక్ష్మిని అతి కిరాతకంగా నరికేశాడు. తనూ మెడ కోసుకున్నాడు. అప్పటి నుంచి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న పెద్దిరాజు బుధవారం డిశ్చార్జ్ కావడంతో ఏలూరు ప్రభుత్వాస్పత్రి వద్ద అరెస్టు చేశారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌తో పాటు సీఐ రవికుమార్, ఎస్ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అదృశ్యమైన విద్యార్థి ఆత్మహత్య



ముసునూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి):చదవడం ఇష్టంలేక లోపూడి ఎస్సీ కాలనీకి చెందిన ఇంటర్ విద్యార్థి చందు(17) ఆత్మహత్య చేసుకున్నాడు. బి.గోపాలరావుకు కుమార్తె రజిత, కుమారుడు దానియేలు (చందు)ఉన్నారు. చందు విస్సన్నపేటలోని ప్రైవేటు కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 21న సెలవులపై కాలేజీ నుంచి బయల్దేరిన చందు ఇంటికి రాకపోవడంతో మంగళ వారం రాత్రి తండ్రి గోపాలరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంటి పక్కనే ఉన్న చర్చి నుంచి బుధ వారం దుర్వాసన రావడంతో కుటుంబ సభ్యులు లోపలికి వెళ్లి చూడగా, చందు బాత్రూమ్‌లో ఉరి వేసుకుని విగతజీవిగా ఉన్నాడు.సమాచారం అందు కున్న ఎస్ఐ చిరంజీవి ఘటనా స్థలానికి చేరుకుని, చందు మృతికి గల కారణాలపై విచారణ జరిపి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. హాస్టల్‌లో ఉండి చదువుకోవడం ఇష్టం లేక చందు ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు చెప్పినట్లు ఎస్ఐ తెలిపారు. తండ్రి గోపాలరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

లారీఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

భీమడోలు, జూలై 23(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలైన ఘటన సూరప్పగూడెం జాతీయ రహదారిపై జరిగింది. ద్వారకాతిరుమల మండలం తిరుమలంపాలెం గ్రామానికి చెందిన ఎం కొండయ్య, టి.రామకృష్ణలు విజయవాడలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బంధువులను పరామర్శించేందుకు మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా సూరప్పగూడెం సమీపంలో పెట్రోల్ కోసం మోటార్ సైకిల్‌ని రాంగ్ రూట్‌లో పోనిచ్చారు. ఎదురుగా వస్తున్న లారీ వీరిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇరువురికి గాయాలు కాగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై ఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రంగాపురంలో బీమాపై రైతులకు సూచనలు

లింగపాలెం,జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌలు రైతులు, కౌలు రైతుకార్డు తప్పని సరిగా తీసుకోవాలని, అలాగే వరిపంటకు ఎకరాకు రూ.840, మినపపంటకు రూ.300 పంటల బీమా చేయించుకోవాలని శాస్త్రవేత్త ఫణికుమార్ అన్నారు. మండలంలోని రంగాపురం, బోగోలు గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. రసాయన ఎరువుల వలన అనారోగ్య పరిస్థితులు ఎదురవుతాయని, సేంద్రియ సాగుపై మక్కువ చూపాలన్నారు.

పదిలక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

జంగారెడ్డిగూడెం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ముస్లీం బాల, బాలికలచే పది లక్షల మొక్కలు నాటించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ రఫీక్ తెలిపారు. ఈ నెల 25 నుంచి జూలై 25 వరకు మొక్కలు నాటనున్నట్టు తెలిపారు. అసదుల్లా జమా మసీదులో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్లాం ధర్మంలో పర్యావరణ పరిరక్షణ ఎంతో ప్రాముఖ్యత ఉందని వివరించారు.పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.

మానవ అక్రమ రవాణా నిరోధానికి కృషి

ఏలూరు రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్(క్రాఫ్) అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. స్థానిక పవర్‌పేట రైల్వే స్టేషన్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ ఆర్.వినోద్‌కుమార్ మాట్లాడుతూ 15వ తేదీ నుంచి 30వ తేదీ వరకు తనిఖీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతి రోజూ పలు రైళ్లలో రెస్క్యూ ఆపరేషన్ చేపడతామన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు రాజేశ్వరరావు, న్యాయవాది పుచ్చల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చైల్డ్ ట్రాఫికింగ్‌కి సంబంధించి, బాధితులకు రక్షణ కల్పిస్తామన్నారు. అనుమానితులు ఉంటే వెంటనే దగ్గర ఉన్న పోలీసులకు సమాచారాన్ని అందించవలిసినదిగా కోరారు.

నేత్రపర్వంగా శివయ్య కల్యాణం



ద్వారకాతిరుమల, జూలై 23(ఆంధ్రజ్యోతి): క్షేత్ర పాలకుడిగా విరాజిల్లుతున్న శివదేవుని ఆలయంలో స్వామివారి కల్యాణం, రుద్రాభిషేకం బుధవారం నేత్ర పర్వంగా నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రం, మాస శివరాత్రి ఒకే రోజు రావడంతో ఈ సేవలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన ఈ ఆలయ ముఖ మండపంలో ఏర్పాటు చేసిన వేదికపై గంగా, పార్వతీ సమేత శివయ్య కల్యాణ మూర్తులను ఉంచి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం కల్యాణ తంతును ప్రారంభించారు.

నారాయణపురం వద్ద లీకవుతున్న తాగునీరు

ఉంగుటూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): నారాయణపురం నుంచి డెల్టా గ్రామాలైన పత్తేపురం, ఆముదాలపల్లి, బైనేపల్లి, తోకలపల్లి తదితర గ్రామాలకు వెళ్లే తాగునీటి పైపు లైన్ స్టేట్ బ్యాంకు వద్ద పగిలింది. దీంతో నీరు వృధాగా పోయి డ్రైనులో కలుస్తోంది. నిడమర్రు మండలంలోని పలు గ్రామాలకు ఈ పైపు లైను ద్వారా తాగునీరు సరఫరా అవుతుండగా బుధవారం పైపు లైను లీకేజీని గుర్తించారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ కంకిపాటి రామారావు వివరణ ఇస్తూ తక్షణం మరమ్మతులు చేయిస్తామన్నారు.

టీచర్లకు పీఎఫ్ రుణాలు మంజూరు చేయండి

ఏలూరు అర్బన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పాఠశాలల్లో పని చేస్తున్న టీచర్లలో 20 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన వారికి నాన్ రికవరీ పీఎఫ్ రుణాలు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం కార్పొరేషన్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసినట్టు తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టీఎన్‌యూఎస్)గౌరవాధ్యక్షుడు నెరుసు రాంబాబు తెలిపారు. రిటైరైన టీచర్లకు ఇప్పటికే పీఎఫ్ మొత్తాలను చెల్లించారని, ఇంకా మిగులు నిధులున్నందున గరిష్ట సర్వీసు పూర్తి చేసిన వారికి వాటిని చెల్లించాలని కోరారు. సంఘ నాయకులు శివశంకర రాజు, గాయత్రి భవాని, బెనర్జీ, రమణ కుమారి వివరించారు.

స్వచ్ఛ సర్వేక్షణ టీమ్ పర్యటన

కుక్కునూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): కుక్కునూరు పంచాయతీలో బుధవారం ఎంపీడీవో నరసింహరావు ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ టీమ్ పర్యటించింది. ఈ సందర్భంగా పంచాయతీలో చెత్త నుంచి సంపద కేంద్రం నిర్వహణ పరిశీలించారు. పాఠశాలలో పర్యవేక్షించి పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. టీమ్ అధికారి సునీల్, మధుప్రియ, సర్పంచ్ రావు మీన, పంచాయతీ కార్యదర్శి ధర్మా గోవింద్, గణేశ్, ఏఈ వీరస్వామి పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఏలూరు క్రైం, జూలై 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. బుధవారం సర్‌సీఆర్‌రెడ్డి పబ్లిక్ స్కూల్లో లీగల్ లిటర్స్ క్లబ్‌ను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా 18 స్కూళ్లలో ఈ లీగల్ లిటర్స్ క్లబ్ పని చేస్తున్నాయని, ఏలూరులో సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్, జడ్పీ హైస్కూల్ శనివారపుపేట, చాటపర్రు పాఠశాలలను ఎన్నుకొని ఈ లీగల్ లిటర్స్ క్లబ్స్‌లను ఏర్పాటు చేసి తద్వారా విద్యార్థులకు చట్టాలపైన సంపూర్ణ అవగాహన కలిగించడం కోసం న్యాయ సేవాధికార సంస్థలు కృషి చేస్తున్నాయని తెలిపారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పీవీఎన్ మునీశ్వరరావు, న్యాయవాది పి.రత్నరాజు, సర్‌సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూలు ప్రిన్సిపల్ మిస్ పి.సాయికుమారి శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రత్న ప్రసాద్

శక్తియాప్, చట్టాలపై అవగాహన

ఏలూరు క్రైం, జూలై 23(ఆంధ్రజ్యోతి): మహిళలు బాలికల రక్షణ కోసం అనేక చట్టాలున్నాయని వాటిని తెలుసుకుని తమ హక్కులు, రక్షణ కోసం వినియోగించుకోవాలని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు అన్నారు. జిల్లా ఎస్పీ కిషోర్ ఆదేశాల మేరకు విద్యార్థులకు చట్టాలపై, శక్తియాప్ వినియోగంపై అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బాష్యం స్కూల్లో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐ సుబ్బారావు మాట్లాడుతూ మహిళలు ఎలాంటి ప్రమాద స్థితిలోనైనా భయపడకుండా పోలీస్ సహాయాన్ని పొందడానికి 112కు కాల్ చేయాలని, (95503 51100)కు సమాచారం అందించాలన్నారు.

లింగపాలెంలో పరిసరాల శుభ్రతపై కళాజాత

లింగపాలెం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటితో పాటు గ్రామాన్ని కూడా శుభ్రంగా ఉంచుకోవాలని కళాజాత బృందం ప్రచారం నిర్వహించింది. మండలంలోని లింగపాలెంలో పరిసరాల శుభ్రతలో భాగంగా ఇళ్లలో ప్లాసిక్ వ్యర్థాలను, ఖాళీకొబ్బరిబోండాలు, చెత్తను ఉంచుకోకూడదన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ చెట్లు నాటాలని, ఆరుబయట మలవిసర్జన చేయడం వల్ల వ్యాధులు వ్యాపిస్తాయని కళాజాత సభ్యులు తెలిపారు.

విభజన.. ఆశలు!

(5వ పేజీ తరువాయి)

చేయాలని డివిజన్ కేంద్రాన్ని మార్చవద్దంటూ అభ్యంతరాలు వెలువెత్తాయి. అయినా సరే ప్రభుత్వం మాటే చెల్లింది. నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల వారీగా ఆనాడు అభిప్రాయ సేకరణలో వచ్చిన సూచనలు ఇప్పటికీ జనం నోటే నానుతున్నాయి. మరోవైపు పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల (చిన్న తిరుపతి) గోపాలపురం నియోజకవర్గం ప్రస్తుత తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఉన్నప్పటికీ స్థానికంగా వచ్చిన డిమాండ్లకు అనుగుణంగా చిన్నతిరుపతిని ఏలూరు జిల్లాలో విలీనం చేశారు. ఉంగుటూరు నియోజకవర్గం ఏలూరు జిల్లా పరిధిలోని గణపవరాన్ని స్థానిక డిమాండ్ల మేరకు పశ్చిమగోదావరి జిల్లాలో విలీనం చేశారు.

పోలవరం కథ ఇంకొకటి : పోలవరం కేంద్రంగా ప్రత్యేక గిరిజన జిల్లాను ఏర్పాటు చేయాలని చాలాకాలం పాటు డిమాండ్ కొనసాగుతూ వచ్చింది. ఎన్నికల ప్రచారంలో అటు టీడీపీ అధినేత చంద్రబాబుకు, ఇటు వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు స్థానికులు నేరుగానే డిమాండ్ చేస్తూ వచ్చారు. ముంపు మండలాలన్నింటిని కలిపి పోలవరం కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేయాల్సిందేనన్న డిమాండ్ కొనసాగుతూ వచ్చింది. కానీ భౌగోళికంగా ఉన్న పరిస్థితులు డిమాండ్‌కు వ్యతిరేకంగా ఉండటంతో ముందడుగు పడలేదు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పోలవరం జిల్లా డిమాండ్ కొనసాగుతోంది. ఈ తరహా పరిస్థితులన్నింటిపైన మంత్రివర్గ ఉపసంఘం సమీక్షించబోతోంది. దీనికి అనుగుణంగా కూటమి, వైసీపీ భవిష్యత్‌లో స్థానిక అంశాల ఆధారంగా మరికొన్ని డిమాండ్లను తెరపైకి తెచ్చే అవకాశాలు లేకపోలేదు.

మంత్రి దృష్టికి చింతలపూడి, లింగపాలెం మండలాల సమస్యలు..

చింతలపూడి, జూలై 23(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో చింతలపూడి, లింగపాలెం మండలాలను నూజివీడులో కలిపారని, ఈ రెండు మండలాలను తిరిగి ఏలూరు డివిజన్‌లోకి మార్చాలని కోరుతూ పలువురు మంత్రి వంగలపూడి అనితకు వినతిపత్రాలు అందజేశారు. గత ప్రభుత్వం అభిప్రాయ సేకరణ చేయకుండా నూజివీడు రెవెన్యూ డివిజన్‌లో ఈ రెండు మండలాలేను కలిపారని, అభ్యంతరం చెప్పినా పట్టించుకోలేదని, ఈ మండలాల్లో ప్రజలు వ్యాపార, విద్య పనుల నిమిత్తం వెళ్లాలంటే రవాణా సౌకర్యం సరిగాలేదని, పైగా దూరం పెరిగిందని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య హోం మంత్రికి వివరించారు. సీపీఐ ఆధ్వర్యంలో టి.బాబు, సీపీఎం ఆధ్వర్యంలో ఆర్.వి.సత్యనారాయణ కూడా ఈ రెండు మండలాలను నూజివీడు డివిజన్‌లో కలపడం వలన ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆంథోనినగర్ వద్ద వినతిపత్రం అందజేశారు. చింతలపూడి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్.కె.ఆజాద్ ఈ రెండు మండలాలు గతంలో కలపవద్దని ప్రజలు అభ్యర్థించినా పట్టించుకోలేదని, ఫలితంగా ఆ డివిజన్ దూరమై ప్రజలకు అందుబాటులోలేదని, ఆ రెండు మండలాలను ఏలూరు డివిజన్‌లో తిరిగి కలపాలని విజ్ఞప్తి చేశారు.

పోలవరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం : మంత్రి అనిత

పోలవరం, జూలై23(ఆంధ్రజ్యోతి): పోలవరాన్ని ఒక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. బుధవారం పోలవరం మండలంలో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనాన్ని ఆమె ప్రారంభించారు.భవన ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రికి ఐజీ అశోక్ కుమార్, ఎస్పీ ప్రశాంత్ శివ కిషోర్, ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి నూతన పోలీస్ స్టేషన్ భవనంలో జరిగిన పూజ శాస్త్రోక్తంగా జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పోలవరాన్ని, అమరావతిని రెండు కళ్లుగా భావిస్తున్నారన్నారు. పోలవరం నిర్మించడమే కాకుండా పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో కలిసి కేబినెట్ సమావేశంలో చర్చించారన్నారు. గత ఐదేళ్లలో పడకేసిన పోలవరం నిర్మాణాన్ని ముఖ్యమంత్రి పరుగులు పెట్టిస్తున్నారన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు పోలవరం నిర్మాణానికి నిర్విరామంగా కృషి చేస్తున్నారన్నారు. ఐజీ, ఎస్పీ, ఏపీ ట్రైకార్, చైర్మన్ పోలవరం ఎమ్మెల్యే హోంమంత్రికి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం మంత్రి ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు నివాసం వద్ద స్థానిక టీడీపీ నేతలతో మమేకమ య్యారు. డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, సీఐ బాల సురేశ్ బాబు, ఎస్ఐ పవన్ కుమార్, తహసీల్దారు సాయి రాజు, ఎంపీడీవో చెరుకూరి శ్రీనివాస్‌బాబు, కూటమి నేతలు బొరగం వెంకటలక్ష్మి, కె.నాగరాజు పాల్గొన్నారు.



మంత్రితో ఎమ్మెల్యే చిర్రి, బొరగం, పోలీస్ అధికారులు

నాయకుల ఘన స్వాగతం..

లింగపాలెం: హోం మంత్రి వంగలపూడి అనితకు లింగపాలెం మండలం ధర్మాజీగూడెం వద్ద ఎమ్మెల్యే రోషన్‌కుమార్, పలువురు కూటమి నేతలు పెద్దఎత్తున చేరుకుని పుష్పగుచ్ఛాలు అందించి ఘనస్వాగతం పలికారు. అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్లు, మోటార్ సైకిళ్లపై భారీ ర్యాలీగా చింతలపూడిలో జరిగే సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమానికి తరలివెళ్లారు. గరిమెళ్ల చలపతిరావు, మోరంపూడి మల్లికార్జున రావు,గుత్తా సత్యసాయివరప్రసాద్, ముసునూరి రాము, పాతూరి శ్రీనివాసరావు, గారపాటి బుజ్జయ్య, మోరంపూడి వరప్రసాద్, వేంపాటి ప్రసాద్, చెరువుగట్టు రామ్మోహన్‌రావు, నిమ్మగడ్డ సుదాకర్ పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి పూజలు..

పెదపాడు: పెదపాడు మండలం అప్పనవీడులోని ప్రసిద్ధి చెందిన అభయాంజనేయ స్వామిని బీసీ సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం, జౌళి అండ్ వస్త్ర పరిశ్రమల శాఖ మంత్రి ఎస్.సవిత, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్,టీడీపీ జిల్లా అధ్యక్షులు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులుతో కలిసి బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయానికి విచ్చేసిన మంత్రి సవిత తదితరులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామికి పూజలనంతరం స్వామి వారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను అందజేశారు.

ప్రజా సమస్యల అర్జీలపై ప్రత్యేక దృష్టి

ఇంటింటికీ వెళ్లి సమస్యలపై ఆరా

ఏలూరుటూటౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వ్యవస్థలన్నింటిని వైసీపీ నిర్వీర్యం చేసిందని ఎమ్మెల్యే బడేటి చంటి ధ్వజమెత్తారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా 9వ డివిజన్‌లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదన్నారు. టీ.గోపాలకృష్ణ, ఎస్.శ్రీనివాస్, ఎం.రాఘవ, క్లస్టర్ ఇన్‌ఛార్జి మారం హనుమంతరావు, బీ.మహేశ్, జే.ప్రతాప్, నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, ఇడా చైర్మన్ పీ.పార్థసారధి, ఏఎంసీ చైర్మన్ ఎం.పార్థసారథి, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు పాల్గొన్నారు.

విద్యాశాఖలో విప్లవాత్మక మార్పులు

మంత్రి లోకేశ్ సారథ్యంలో విద్యాశాఖలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయని ఎమ్మెల్యే చంటి అన్నారు. నందమూరి ఫ్యాన్స్ సమకూర్చిన పుస్తకాలు,పెన్నులను శ్రీశర్వాని స్కూల్ విద్యార్థులకు ఎమ్మెల్యే చంటి పంపిణీ చేశారు. నందమూరి ఫ్యాన్స్ నాయకులు వీబీజీ తిలక్, కె.శ్రీనివాస్, పాఠశాల డైరెక్టర్ కే.మధన్‌మోహన్, ప్రిన్సిపల్ సత్యశారధ, ఎస్.నాగరాజు, టి.మనోహర్ పాల్గొన్నారు.

సమస్యల అర్జీలను పరిష్కరించండి..

దెందులూరు: వివిధ పనుల మీద ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజా వినతులు స్వీకరించి పరిష్కరించాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అధికారులకు సూచించారు.బుధవారం దెందులూరు నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో వివిధ సమస్యలతో వచ్చిన వినతులను సంబంధిత అధికారులకు బదిలీ చేశారు. పింఛన్లు, ఇళ్లు, తల్లికి వందనం సమస్యలను కలెక్టర్ ద్వారా రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని చింతమనేని అన్నారు.



వృద్ధుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి

మండూరులో సుపరిపాలనలో తొలిఅడుగు

పెదవేగి మండలం మండూరులో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ మండలాధ్యక్షులు ఈడ్పుగంటి అనిల్, అన్నపనేని సురేశ్, మండూరి బ్యాంక్ అధ్యక్షులు కోనకళ్ల శివమణిగౌడ్‌లతో కలిసి ఇంటింటి చింతమనేని ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మండూరు టీడీపీ గ్రామ నాయకులు పాల్గొన్నారు.



వంటకాలను పరిశీలిస్తున్న వెంకటలక్ష్మమ్మ

నూరుశాతం ఫలితాల సాధనకు కృషి

పెదపాడు, జూలై 23(ఆంధ్రజ్యోతి):టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా తగిన చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. పెదపాడు మండలం కొత్తూరు ప్రాథమిక పాఠశాలను డీఈవో వెంకటలక్ష్మమ్మ బుధవారం సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. డీఈవో మాట్లాడుతూ బడిబయట పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని, 8, 9, 10వ తరగతుల్లో డ్రాపవుట్స్, ట్రాన్సిషన్, బాల్య వివాహాలపై దృష్టి సారించాలని, వాటిపై తల్లిదండ్రుల్లో అవగాహన పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి, భోజన నాణ్యతను రుచి చూశారు. విద్యా ప్రగతి, పాఠశాలలో మౌలిక వసతులు తదితర అంశాలపై సమీక్షించారు. ఎంఈవో సబ్బితి నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఫాస్టెస్ట్ స్విమ్మర్‌గా స్వామి నాయుడు



ఏలూరు రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): వైజాగ్‌లో 19, 20వ తేదీల్లో జరిగిన స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో విద్యార్థి బలగ స్వామి నాయుడు వివిధ పతకాలతో పాటు వ్యక్తిగత ఛాంపియన్‌షిప్ సాధించడంతో పలువురు అభినందించారు. తంగెళ్లమూడిలోని శ్రీసూర్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ కొండపల్లి చంద్రశేఖరరావు మాట్లాడుతూ తమ విద్యార్థి స్విమ్మింగ్ పోటీల్లో రాణించడం గర్వకారణంగా ఉందన్నారు. 100, 200 మీటర్ల ఫ్రీస్టైల్లో రెండు గోల్డ్ మెడల్స్, 100 మీటర్ల బటర్‌ఫ్లై, 100 మీటర్ల బ్యాక్ స్ట్రోక్ విభాగంలోనూ, 200 మీటర్ల వ్యక్తిగత స్విమ్మింగ్‌లో బంగారు పతకం సాధించాడు. మొత్తం 5 బంగారు పతకాలు సాధించి వ్యక్తిగత ఛాంపియన్‌షిప్ అవార్డుతో ఏపీ స్టేట్ ఫాస్టెస్ట్ స్విమ్మర్‌గా ఎంపికవడం సంతోషంగా ఉందన్నారు. ఒకవైపు చదువుల్లో మరొకవైపు స్విమ్మింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న స్వామి నాయుడు విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈసందర్భంగా విద్యార్థిని అధ్యాపకులు, నగర ప్రముఖులు అభినందించారు.

ఘనంగా జెండా ఆవిర్భావ దినోత్సవం

ఏలూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఈదర సుబ్బమ్మదేవి హైస్కూల్లో జాతీయ పతాక ఆవిర్భావ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. తెలుగువారైన పింగళి వెంకయ్య రూపొందించిన మువన్నెల జెండా భారత జాతీయ పతాకంగా ఆమోదించబడిన శుభదినమని పలువురు వక్తలు పేర్కొన్నారు. నెక్కంటి శ్రీనివాసరావు సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రం కిషోర్, హెచ్ఎం కుటుంబరావు, ఘంటసాల స్వరపీఠం కార్యదర్శి ఎస్.సుబానీ, దేవరకొండ వెంకటేశ్వర్లు, వీటీ అర్జునరావులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

పెదపాడు, జూలై 23(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్లో బుధవారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి చక్రధర్ పర్యవేక్షణలో వైద్యులు కె.సురేంద్రబాబు ఈ పరీక్షలను నిర్వహించారు. కంటి పరీక్షలు నిర్వహించి 26 మంది పిల్లలకు కళ్లజోళ్లు అవసరమని గుర్తించి, వాటిని ఉచితంగా అందజేస్తామన్నారు. హెచ్.ఎం. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పట్టిసీమ నుంచి నీటి విడుదల నిలిపివేత

పోలవరం, జూలై 23(ఆంధ్రజ్యోతి):పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి నీటివిడుదలను బుధవారం నిలిపివేసినట్టు ఈఈ యేసుబాబు బుధవారం తెలిపారు. భారీ వర్షాల వల్ల నీటి నిల్వలు ఉన్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటి విడుదల నిలిపివేశామన్నారు. అవసరం మేరకు మోటార్లతో విడుదల చేస్తున్నామన్నారు.

మైక్ సెట్ బహూకరణ

ఏలూరు రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): మానవత జిల్లా కేంద్ర నియంత్రణ, విద్యానిధి కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు రామకోటి ప్రాంగణంలో పురావస్తు ప్రదర్శనశాలకు సందర్శకుల ఉపయోగార్థం మైక్ సెట్ అందజేశారు. పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.తిమ్మరాజు, టెక్నికల్ ఇన్‌చార్జి స్వర్ణసత్యవతి, మానవత మండల చైర్ పర్సన్ అడుసుమిల్లి నిర్మల, డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ మేతర అజయ్‌బాబు, జిల్లా కన్వీనర్ పోలవరపు దేవరత్నాకరరావు, పోదూరి కనకదుర్గ, అల్లూరి మోహిని, గారపాటి పద్మజావాణి, సభ్యులు, ద్రోణాదుల శ్రీనివాసు, బివి సుబ్బారావు, పుల్లాబొట్ల సత్యవాణి, కడుపు కన్నయ్య పాల్గొన్నారు.

కాగుపాడు గ్రామానికి వితరణ

ఉంగుటూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): కాగుపాడు గ్రామానికి చెందిన ఆడపడుచు పూడోట సునీత తన తల్లిదండ్రులు గూడపాటి సత్యనారాయణ, భారతిల పేరున అభివృద్ధికి రూ.7 లక్షలు అందజేశారు.గ్రామంలో సీసీ కెమేరాలకు రూ.3 లక్షలు, కడియాల రామయ్య అనసూయాదేవి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ల్యాబ్ పరికరాల నిమిత్తం రూ.4 లక్షలు అందించినట్టు చేబ్రోలు సొసైటీ అధ్యక్షులు కె.రవిశంకర్ తెలిపారు.

హామీలు అమలు చేయాలి

ఏలూరుకార్పొరేషన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు బుధవారం పేర్కొన్నారు. ఎన్నికలముందు సూపర్-6 పథకాలంటూ ప్రజలకు ఆశ చూపించి వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు.ప్రజల ఆగ్రహానికి గురికాకుండా హామీలను అమలు చేయాలని, పేదలకు ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఆయన వెంట ఏఐటీయూసీ నాయకులు రెడ్డి శ్రీనివాసడాంగే, పళ్ళెం కిషోర్ ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఏలూరుటూటౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పి.గంగరాజు (35)కుటుంబానికి ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆగిరిపల్లి మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన గంగరాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎంపీ మహేశ్ వెంటనే స్పందించిన గంగరాజు కుటుంబానికి సాయం అందించారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు పరీక్షలు

కామవరపుకోట, జూలై 23(ఆంధ్రజ్యోతి):104 వాహనం ద్వారా గ్రామాల్లోని ప్రజలకు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకున్నట్టు వైద్యాధికారి సి.హెచ్. సుమ, టి.అరుణలు తెలిపారు. బుధవారం తడికలపూడిలోని సొసైటీ ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిరక్షణలో సలహాలు, సూచనలిచ్చారు. ఈ శిబిరంలో వ్యాధిగ్రస్థులకు మందులు ఉచితంగా అందచేశారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రీ సర్వే పరిశీలన

భీమడోలు, జూలై 23(ఆంధ్రజ్యోతి): రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర భూ పరిపాలన శాఖ అదనపు చీఫ్ కమిషనర్, సర్వేశాఖ డైరెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. భీమడోలు మండలం సూరప్పగూడెంలో జరిగిన రీ సర్వే గ్రామసభలకు ప్రభాకర్ రెడ్డితో పాటు జేసీ ధాత్రిరెడ్డి, ఆర్డీవో అచ్యుత అంబరీష్ పాల్గొన్నారు. గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వేపై ఆరా తీశారు. అనంతరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి రీ సర్వే దోహదపడుతుందన్నారు.

శ్మశానవాటికను అభివృద్ధి చేస్తాం

ఏలూరుటూటౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): శ్మశానవాటికల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. దక్షిణపు వీధి శ్మశాన వాటికలో పిచ్చిచెట్లు, తుప్పలతో అధ్వానంగా తయారైంది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే చంటి దృష్టికి తీసుకెళ్లగా బాగు చేయించాలని ఆదేశించారు.వన్‌టౌన్‌లో మార్వాడీ వ్యాపారుల సహకారంతో శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని సూచించారు.



ర్యాలీలో పాల్గొన్న అప్పల నాయుడు

జనసైనికుల భారీ బైక్ ర్యాలీ

ఏలూరు రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' సినిమా విజయవంతం కావాలని ఏలూరులో బుధవారం అప్పల నాయుడు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.జనసేన పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమై పురవీధుల గుండా సాయి బాలాజీ థియేటర్ వరకు ర్యాలీ సాగింది. అనంతరం సాయిబాలాజీ థియేటర్‌లో పవన్‌కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఏలూరు సిటీ వైడ్ జనసేన అభిమానసంఘ గౌరవ అధ్యక్షులు దోసపర్తి రాజు, కోమకుల శ్రీను (పూల శ్రీను), మెగా అభిమానుల శానం రామకృష్ణమూర్తి, శానం ఉదయ్‌సాయి,పత్తేబాద ప్రేమ్‌కుమార్, పండునాయుడు, అరవింద్, రోహిత్ పాల్గొన్నారు.

పవన్ ఫ్లెక్సీకి పాలాభిషేకం...




జంగారెడ్డిగూడెం: పవన్ డిప్యూటీ సీఎం అయిన తరువాత వచ్చిన మొదటి సినిమా కావడంతో అభిమానుల అంచనాలకు తగినట్టు ఉంటుందని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. హరిహర వీరమల్లు చిత్రం విడుదల సందర్భంగా రాజేశ్వరి థియేటర్ వద్ద పవన్ ఫ్లెక్సీకి పోలవరం ఎమ్మెల్యే పాలాభిషేకం చేశారు. అనంతరం భారీ కేక్ కట్ చేశారు. తీన్మార్ డప్పుల మధ్య పట్టణంలో జనసేన శ్రేణులు ర్యాలీ నిర్వహించారు.

అప్పులు తీర్చలేక వ్యక్తి ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం, జూలై 22(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై చేసిన అప్పులు తీర్చలేక పట్టణానికి చెందిన పామర్తి కుమారస్వామి(37) బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారస్వామికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మద్యానికి బానిసై అప్పులు చేశాడు. ఈ నెల 8న అతడి భార్యను డబ్బులడిగాడు. ఆమె లేవనడంతో మనస్థాపానికి గురయ్యాడు. అదే రోజు వారి ఇంటి దగ్గరలో ఉన్న ఖాళీ స్థలంలోకి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువులు గుర్తించి మెరుగైన వైద్యం కోసం విజయవాడ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ ఎస్.ఉమామహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉత్సాహంగా పల్లెపల్లెకు మన పత్సమట్ల



నిడమర్రు, జూలై 22 (ఆంధ్రజ్యోతి):పల్లెపల్లెకు మన పత్సమట్ల కార్యక్రమం పెదనింద్రకొలను, గుణపర్రు, నిడమర్రు గ్రామాల్లో ఉత్సాహంగా జరిగింది. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఎంతో ఓపికగా ప్రజా సమస్యలను ఆలకించి ప్రత్యేక అధికారుల బృందం ద్వారా వినతులు స్వీకరించారు. పెదనింద్రకొలనులో గ్రామంలో రేషన్ కార్డుల, కాలనీలకు రోడ్ల నిర్మాణం, కొల్లేరుసాగు భూముల్లో ఉప్పునీరు పడటం, విద్యుత్ అంతరాయం. ప్రజలు వినతులు సమర్పించారు. నిడమర్రు గ్రామాల్లో జరిగిన సమావేశంలో గ్రామస్థులు ఊరిలో వీధుల మురుగు నీరు అధ్వానంగా ఉన్న డ్రైనేజీ గురించి, ఇళ్లపట్టాల గురించి, కొల్లేరు పట్టా భూములకు రైతు భరోసా పడకపోవడం గురించి వినతులు సమర్పించారు. గ్రామ సర్పంచ్‌లు ముగ్గళ్ల యాకోబు, పొట్నూరి ఉమామహేశ్వరరావు, పొట్నూరి సింహచలం, మేకా వెంకటరమణ, చెల్లంశెట్టి సూరిబాబు, ఇంటి ఉదయభాస్కర్, మీసాల హరిబాబు, అంబళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

ఫిషర్‌మెన్ సొసైటీ ఆగ్రహం

దెందులూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి):ప్రజల సొమ్మును స్వాహా చేసిన వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని దళిత ఫిషర్‌మెన్ సొసైటీ సభ్యులు ఆరోపించారు. వీరభద్రపురం గ్రామానికి చెందిన చెరువు డబ్బులను చెల్లించకుండా తిరిగి తమపై వైసీపీ నేత వేమూరి జితేంద్ర, బసవ పున్నయ్యలు అసత్య ప్రచారాలు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని వీరభద్రపురం ఫిషర్‌మెన్ సొసైటీ సంఘం ప్రెసిడెంట్ ఉప్పే రంగారావు, కార్యదర్శి జోసఫ్ తంబి, కోశాధికారి చిన్నదాసులు అన్నారు. బుధవారం సోమవరప్పాడులోని మాజీ ఏఎంసీ చైర్మన్ మాగంటి సురేంద్రనాథ్ చౌదరి నివాసంలో టీడీపీ మండలాధ్యక్షుడు మిల్లుబాబు, టీడీపీ నేత గిరిబాబుల ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. సమావేశంలో 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే వైసీపీ నాయకుల తీరును వివరించారు.చిమ్మ సురేశ్, మాగంటి గిరిబాబు, ఫిషర్‌మెన్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి కలెక్టర్ సాయం

లింగపాలెం, జూలై 23(ఆంధ్రజ్యోతి): తన మనవడు తాడిగడప మహేశ్‌కు గురుకుల పాఠశాలలో సీటు ఇప్పించమని బుల్లా నాగేశ్వరరావు వేడుకోవడంతో కలెక్టర్ స్పందించి తక్షణ చర్యలు తీసుకున్నారు. తిమ్మక్కపాలెం గ్రామానికి చెందిన బుల్లా నాగేశ్వరరావు అనే వృద్ధుడు తన కుమార్తెను భర్త వదిలేయడంతో ఇద్దరు కుమారులతో కలిసి తనవద్దే ఉంటోందని తెలిపారు. ఆర్థికపరిస్థితి సరిగా లేక,బయట స్కూల్లో చదివించలేక పోతున్నామని మనవడు మహేశ్‌కు గురుకుల పాఠశాలలో సీటు ఇప్పించమని వేడుకున్నాడు. వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆ బాలుడికి పెదవేగి గురుకులంలో సీటు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాలతో బుల్లా నాగేశ్వరరావు ఆనందం వ్యక్తం చేశారు.

యూటీఎఫ్ సభ్యత్వాల నమోదు

ఉంగుటూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి):కైకరం, ఉంగుటూరు హైస్కూళ్లలో బుధవారం యూటీఎఫ్ సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో భాగంగా జిల్లా అధ్యక్షులు ముస్తఫా ఆలీ కైకరం హైస్కూల్లో సభ్యత్వాల నమోదును ప్రారంభించారు. అనంతరం ఉంగుటూరు, నారాయణపురం, బాదంపూడి, చినవెల్లమిల్లి, గొల్లగూడెం, అక్కుపల్లి గోకవరం హైస్కూళ్లలో సభ్యత్వాల నమోదు చేపట్టారు. మండల శాఖ గౌరవాధ్యక్ష, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శీతాల సత్యనారాయణ, ఉనుముల రాంబాబు, డాకి జోగి నాయుడు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

ఏలూరు రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): గుడివాకలంక మెడల్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు ట్రీస్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ దిద్ల యాంజిలో ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. దాతను పాఠశాల హెచ్ఎం నంబూరి రాంబాబు అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు శ్రీదేవి కళ్యాణి, ఎన్.వరలక్ష్మి, బి రాము, ఎన్ సుమశ్రీ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : సమగ్రశిక్ష ఆధ్వర్యంలో జిల్లాలోని కుక్కునూరు, నిడమర్రు భవిత క్లస్టర్ల పరిధిలోని 6 మండలాల్లోని భవిత కేంద్రాల్లో పని గంటల(అవర్లీ బేసిస్)విధానం ప్రాతిపదికన గౌరవ వేతనంపై తాత్కాలికంగా నియమించేందుకు ఉద్దేశించిన రెండు ఫిజియోథెరపిస్టు పోస్టులకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఎస్ఎస్ఏ జిల్లా ఏపీసీ పంకజ్ కుమార్ తెలిపారు. బీపీటీ /ఎంపీటీ విద్యార్హతను బట్టి అభ్యర్థులు తమ దరఖాస్తులను ఏలూరు డీఈవో కార్యాలయ ప్రాంగణంలోని సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయంలో ఈ నెల 26 నుంచి 29వ తేదీలోగా అందజేయాలని కోరారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోండి

కొయ్యలగూడెం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మానవత సంస్థ మండలాధ్యక్షులు మందపాటి రామకృష్ణ కోరారు.ఈ మేరకు బుధవారం మండలంలోని దిప్పకాయలపాడులో అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థిక సాయం అందించారు. ఆయన మాట్లాడుతూ పేదలను ఆదుకోవడమే మానవత లక్ష్యమన్నారు. ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో తోటి వారిని ఆదుకోవాలన్నారు. మానవత సభ్యులు గడా సుబ్బారావు, చంటి, అమీర్‌బాష, కోశాధికారి సవ్వా రాము, మాజీ అధ్యక్షులు ముప్పాలనపల్లి వెంకటేశ్వరరావు, గద్దే మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా రుణాల లక్ష్యం రూ.60 కోట్లు

మండవల్లి జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని 1290 డ్వాక్రా గ్రూపులకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 60 కోట్లు రుణాలు మంజూరు లక్ష్యమని మండవల్లి వెలుగు ప్రాజెక్టు ఏపీఎం రాజశ్రీ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వెలుగు మిత్రల సమావేశం నిర్వహించారు. ఏదైనా గ్రూపు రుణం తీసుకోకపోతే ఆ గ్రూపు సభ్యులు ఎవరైనా వారి అవసరాన్ని బట్టి రూ.2 నుంచి 3లక్షలు వరకు రుణం పొందవచ్చన్నారు. 3 నెలల్లో ఇప్పటి వరకు 192 గ్రూపులకు రూ.17 కోట్లు రుణం పొందారని తెలిపారు.

ప్రమాదకర గుంత వద్ద రక్షణ చర్యలు

చాట్రాయి, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణారావుపాలెంలో రహదారిపై ప్రమాదకర గుంత వద్ద బుధవారం ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు రక్షణ ఏర్పాట్లు చేశారు. బైక్ గుంతలో పడి ఒకరు గాయపడిన విషయం విదితమే. దీంతో ఎస్సై బారికేడ్లు అడ్డు పెట్టించారు. నూజివీడు ఆర్‌అండ్‌బీ డీఈఈతో ఎస్సై ఫోన్‌లో మాట్లాడి వెంటనే గుంత పూడ్చాలని కోరగా గురువారం మరమ్మతు చేస్తామని హామీ ఇచ్చారు. తక్షణమే స్పందించిన ఎస్సై రామకృష్ణను, సిబ్బందిని స్థానికులు అభినందించారు.

పోలవరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం : మంత్రి అనిత

పోలవరం, జూలై 23(ఆంధ్రజ్యోతి): పోలవరాన్ని ఒక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. బుధవారం పోలవరం మండలంలో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనాన్ని ఆమె ప్రారంభించారు.భవన ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రికి ఐజీ అశోక్ కుమార్, ఎస్పీ ప్రశాంత్ శివ కిషోర్, ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి నూతన పోలీస్ స్టేషన్ భవనంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పోలవరాన్ని, అమరావతిని రెండు కళ్లుగా భావిస్తున్నారన్నారు. పోలవరం నిర్మించడమే కాక పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో కలిసి కేబినెట్ సమావేశంలో చర్చించారన్నారు. గత ఐదేళ్లలో పడకేసిన పోలవరం నిర్మాణాన్ని సీఎం పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ఐజీ, ఎస్పీ, ఏపీ ట్రైకార్, చైర్మన్ పోలవరం ఎమ్మెల్యే హోంమంత్రిని సన్మానించారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి : కామినేని

కైకలూరు, జూలై 23(ఆంధ్ర జ్యోతి): గ్రామాల అభివృద్ధిలో పార్టీలకు, వివాదాలకు తావు లేకుండా అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఎంపీపీ అడవి కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కైకలూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో తాగు, సాగు నీరు, రహదారుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని ఎక్కడికక్కడే రహదారులను అభివృద్ధి చేసుకుంటూ వస్తున్నామన్నారు. అయినప్పటికీ ఆర్‌అండ్‌బీ రహదారులు అనతికాలంలోనే ధ్వంసమై ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. రానున్న రోజుల్లో గ్రామాల్లో అన్ని రహదారులను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేస్తామని, అలాగే విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు లేకుండా ఉండేందుకు సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. కైకలూరు గ్రీన్ విలేజ్‌లో గత వైసీపీ ప్రభుత్వం ప్రజల సొమ్ము రూ.220 కోట్లు ఖర్చు చేసినప్పటికీ ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోయిందన్నారు. సరైన వసతులు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని త్వరలోనే గృహ నిర్మాణ శాఖ మంత్రిని తీసుకువచ్చి గ్రీన్ విలేజ్‌లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు, మండల టీడీపీ అధ్యక్షులు పెన్మెత్స త్రినాధరాజు, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ....

అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన 19 మందికి రూ.10,09,370 విలువ చేసే సీఎం సహాయనిధి చెక్కులను కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో ఎమ్మెల్యే కామినేని అందజేశారు. రాష్ట్ర వడ్డిసాధికార సమితి కన్వీనర్ బలే ఏసురాజు, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూల రామచంద్రరావు, జనసేన, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

డ్రెయిన్ పూడ్చివేతతో విద్యార్థుల పాట్లు



చాట్రాయి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మగూడెం యూపీ స్కూల్ నుంచి వచ్చే డ్రెయిన్‌ను ఓ వ్యక్తి పూడ్చి వేయటంతో పాఠశాలకు వెళ్ళే దారిలో మురుగునీరు నిలిచింది. ఈ మురుగునీటి నుంచే విద్యార్థులు రాకపోకలు సాగిస్తుండటంతో పిల్లలకు రోగాలు సోకే ప్రమాదం ఉన్నదని తల్లి దండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై నూజివీడు సబ్ కలెక్టర్‌కు, మండల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని సామాజిక కార్యకర్త మందలపు కనకారావు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా హీరో సూర్య జన్మదిన వేడుకలు

కలిదిండి, జూలై 23 (ఆంధ్ర జ్యోతి): కోరుకొల్లులో బుధవారం అభిమానులు సూర్య జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. అనంతరం అభిమానులు సూర్య చిత్ర పటాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. నున్న సుబ్రహ్మణ్యం, జి.శ్రీనివాస రావు, నల్లిబోయిన భోగేశ్వరరావు, తలారి హరీష్, వలవల రాజేష్; తోకల వెంకన్నబాబు, చేబోయిన మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా రోడ్డు మరమ్మతులు



ముదినేపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పెదగొన్నూరులో అధ్వానంగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులను కూటమి నాయకులు స్వచ్ఛందంగా చేపట్టారు. ఈ రహదారిలో గోతుల్లో నిలిచి ఉన్న వర్షపు నీరు పోయేందుకు డ్రైన్లు తవ్వించి గోతులను పూడ్చే పనులను నిర్వహిస్తున్నారు. నడిచేందుకు కూడా ఇబ్బందులు పడుతుండటం, విద్యార్థులు హైస్కూలుకు సైకిళ్లపై వెళ్లటంలో ఇబ్బందులపై స్పందించిన నాయకులు గుడివాడ వేణు, శ్రవణం పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్‌తో రోడ్ల మరమ్మతు పనులు నిర్వహిస్తున్నారు.


నూగొండపల్లిలో మట్టిగుట్టలు

సాయిల్.. ఎనీటైం ఫర్ సేల్!

నూజివీడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేని సాయిల్ ర్యాంప్. వర్షాలు ప్రారంభం కావడంతో చెరువుల్లో మట్టి తవ్వకాలకు ఇబ్బంది కాబట్టి ముందుగానే చెరువుల నుంచి మట్టిని అక్రమంగా తోలి సమీపంలోని ఒక పొలంలో పెద్దగుట్టగా పోసి ఎనీ టైం సాయిల్ అమ్మకానికి కొందరు అధికార పార్టీ నేతలు ఏర్పాటు చేసిన సాయిల్ డెన్ ఇది. సాయిల్‌ను ఇలా అక్రమంగా గుట్టలుగా పోయడానికి అనుమతులు ఉండవు. మట్టి తవ్వకాలు, అమ్మకాలలో లాభం రుచిచూసిన ఈ మట్టి మాఫియా వర్షాలు పడినా తమ వ్యాపారానికి ఎలాంటి విరామం లేకుండా మట్టిని గుట్టలుగా పోసి అమ్ముకుంటున్నారు. ఆగిరిపల్లి మండలం నూగొండపల్లి గ్రామ పరిధిలోని చెరువులోని మట్టిని పక్కనే ఒక పొలంలో ఇలా గుట్టలుగా పోసి ఉంచారు. అలాగే కొత్త ఈదర గ్రామంలోని చెరువు మట్టిని అక్కడే ఒక పక్కన గుట్టలుగా పోసి రెడీ ఫర్ సేల్‌కు ఉంచారు. ఇవేకాదు నూజివీడులోని కొన్ని గ్రామాలు, ముసునూరు మండలంలోని చిల్లబోయినపల్లి గ్రామంలోనూ అక్రమ మట్టి తవ్వకాలు గంటకు మూడు ట్రాక్టర్లు ఆరు టిప్పర్లుగా సాగుతున్నాయి. ఈ మట్టి గుట్టల గురించి బుధవారం ఆగిరిపల్లి తహసీల్దార్‌కు రాతపూర్వక ఫిర్యాదు అందింది.

విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు

నూజివీడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నవరం జడ్పీ హైస్కూలులో బుధవారం విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. శ్రీభాను స్మైల్ దంత వైద్యశాల వైద్యులు డాక్టర్ దేవిశెట్టి దినేష్‌బాబు, ఎ. ప్రసాద్ దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. హెచ్‌ఎం విజయకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475


సి.గుడిపాడులో వెదజల్లే పద్ధతిలో సాగు చేసిన వరి

వెదజల్లే లాభాలు

- వరిలో వెదజల్లే పద్ధతే మేలు
- సొమ్ము ఆదా అంటున్న రైతులు

చాట్రాయి, జూలై 23(ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా పలువురు ఔత్సాహిక రైతులు వరిలో వెదజల్లే పద్ధతి అనుసరిస్తూ లాభాలు గడిస్తున్నారు. మండలంలో చనుబండ, నరసింహారావుపాలెం, సి.గుడిపాడు, కోటపాడు, చీపురుగూడెం తదితర గ్రామాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో సుమారు 700 ఎకరాల్లో రైతులు వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేశారు. ఈ విధానం వల్ల నారు పెంపకం, నాట్లుకు ఎకరానికి సుమారు రూ. 5 వేల వరకు ఖర్చు తగ్గుతున్నదని, దిగుబడులు కూడా నాట్లు వేసిన పొలంలో మాదిరిగానే వస్తున్నాయని, పైగా వర్షాభావ పరిస్థితులను తట్టుకుంటుందని రైతులు చెబుతున్నారు. అంతే కాక గ్రామాల్లో కూలీల సంఖ్య తగ్గిపోవటం వల్ల వరినాట్లు వేయటానికి సకాలంలో కూలీలు దొరకటం లేదని దీనిని అధిగమించటానికి వెదజల్లే పద్ధతి అనుసరించి లాభాలు పొందుతున్నట్టు రైతులు చెబుతున్నారు.

దిగుబడిలో వ్యత్యాసం లేదు



వరిలో వెదజల్లే పద్ధతి అనుసరించటం వల్ల దిగుబడిలో వ్యత్యాసం లేదు. గ్రామాల్లో కూలీల కొరత ఇబ్బందిగా ఉంది. సీజన్‌లో కూలీలకు విపరీతమైన డిమాండ్ ఉంటోంది. వెదజల్లే పద్ధతి వల్ల రూ. 5 వేలు వరకు ఖర్చు మిగులుతున్నది.

- జలసూత్రం వెంకటేశ్వరరావు, రైతు, సి. గుడిపాడు, చాట్రాయి మండలం.

వేరు వ్యవస్థ బలంగా ఉంటుంది



వెదజల్లే పద్ధతి వల్ల వేరు వ్యవస్థ బలంగా ఏర్పడి దుబ్బు బాగా కడుతుంది. ఈదురు గాలులకు పైరు తట్టుకుని నిలబడుతుంది. ఎక్కువ విస్తీర్ణం తక్కువ సమయంలో సాగు చెయ్యవచ్చు. ఎకరానికి రూ. 5 వేలు వరకు ఖర్చు కలిసివస్తుంది. దిగుబడులు బాగానే వస్తాయి. కూలీల కొరతను అధిగమించవచ్చు.

- బి. శివశంకర్, ఏవో, చాట్రాయి మండలం.

చెప్పులు, చీపుళ్లతో తిరగబడతారు..

- టీడీపీ ముసుగులో వైసీపీ గూండాల అరాచకం
- సహించేది లేదన్న ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు



విలేకరులతో మాట్లాడుతున్న ఏబీ వెంకటేశ్వరరావు

నూజివీడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలం ముక్కొల్లు పాడులో టీడీపీ ముసుగులో వైసీపీ గూండాల అరాచకాలను సహించేది లేదని ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. బుధవారం నూజివీడు వెలుగు కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముక్కొల్లుపాడులో డ్వాక్రా బుక్ కీపర్ పద్మ అనే బీసీ మహిళను అక్రమంగా తొలగించడానికి అధికార పార్టీ ముసుగులో ఈ వైసీపీ నాయకులు ప్రయత్నించడమే కాక ఆమెకు మద్దతుగా ఉన్నవారిపై దాడులు చేస్తుండటంతో ముక్కొల్లుపాడు గ్రామస్థుడిగా ఈ అన్యాయాన్ని సహించలేక తాను అధికారులను కలిసి పరిస్థితిని వివరించి నిబంధనలు పాటించమని కోరడానికి వెలుగు కార్యాలయానికి, నూజివీడు రూరల్, పట్టణ పోలీస్ స్టేషన్‌లకు వచ్చినట్లు తెలిపారు. పద్మ కుటుంబం టీడీపీ సానుభూతిపరులు కావడంతో వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన ఈ గ్రామ నాయకులు గతంలో తమకు వ్యతిరేకంగా వ్యవహరించిన పద్మను వేధించటానికి ఇప్పుడు అధికార పార్టీ ముసుగు వేసుకొని ఆమెను తొలగించడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఆమెకు మద్దతుగా ఉన్న వారిపై దాడులు చేయడమే కాక ఆమె నుంచి రికార్డులను సైతం దొంగలించడానికి ప్రయత్నాలు చేశారని వీటిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు చర్యలు తీసుకోకపోవడంతో తాను సంబంధిత అధికారులను కలిసి నిబంధనలను పాటించి న్యాయం చేయాలని కోరినట్లు వివరించారు. టీడీపీలోకి వచ్చిన ఈ ముఠా గ్రామంలో రోజుకో కేసు పెడుతూ ప్రశాంతతను పాడు చేస్తోందన్నారు. ఈ ముఠా వెనుక గ్రామంలో పాత పెత్తందారులు ఉన్నారన్నారు. పరిస్థితి మారకపోతే గ్రామంలో మహిళలు చెప్పులు, చీపుళ్లతో వీరి భరతం పడతారన్నారు. పార్టీ మారినంత మాత్రాన ఆబోతులు ఆవులు కావన్నారు. తొలుత ఏబీ వెంకటేశ్వరరావు వెలుగు కార్యాలయం సీసీ కుమారితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తనకు బుక్ కీపర్‌ను తొలగించే అధికారం లేదని ఆమె సమాధానం చెప్పడంతో నిబంధనలు పాటించి అందరినీ సమావేశపరిచి మెజార్టీ సభ్యుల అభిప్రాయాల ప్రకారం నడుచుకోవాలని ఆమెను కోరారు. కాగా కొత్త రావచర్లకు చెందిన కే లక్ష్మీసుజాత అనే మరో బుక్ కీపర్ తనపై సభ్యులు ఎలాంటి ఫిర్యాదులు చేయకపోయినా తనను తొలగించాలని గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఒత్తిడి చేస్తున్నారని తన పనులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తాను కోర్టుకు వెళ్ళి స్టే తెచ్చుకొన్నా తనను విధుల్లోకి తీసుకోవడం లేదని ఆమె ఏబీవీకి, విలేకరులకు తెలిపారు. దీనిపై సీసీ కుమారిని వివరణ కోరగా ఆమెను బుక్‌కీపర్‌గా తొలగించలేదని ఆమె స్థానంలో మరొకరు పనిచేస్తున్న విషయం తనకు తెలియదన్నారు. త్వరలో సభ్యులందరినీ సమావేశపరిచి నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకుంటామని ఏబీకి తెలిపారు. అక్కడ నుంచి ఆయన నూజివీడు రూరల్, టౌన్ పోలీస్ స్టేషన్లలో ఎస్‌ఐలను కలసి పద్మ దగ్గర నుంచి రికార్డులు అపహరించడానికి ప్రయత్నించిన కేసు దర్యాప్తు ఎంత వరకు వచ్చిందని తెలుసుకున్నారు. అలాగే గ్రామంలో సదరు మహిళలను వెలుగు కార్యాలయానికి ఫిర్యాదు చేయడానికి తీసుకువచ్చిన ఆటో డ్రైవర్‌పై ఈ ముఠా చేసిన దాడిలో గాయపడ్డ వ్యక్తి పెట్టిన కేసు దర్యాప్తు ఎంత వరకు వచ్చిందని అడిగి, నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి ఎవరి తప్పుంటే వారిపై కేసు నమోదు చేయాలని పోలీస్ అధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

బీజేపీ జిల్లా కార్యవర్గంలో నూజివీడుకు ప్రాధాన్యం

నూజివీడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఏలూరు జిల్లా నూతన కార్యవర్గంలో నూజివీడుకు ప్రాధాన్యత లభించింది. నూజివీడుకు చెందిన సీనియర్ నాయకులు బోను అప్పారావు, శివరాజు వసుందరాదేవికి జిల్లా ఉపాధ్యక్ష బాధ్యతలు లభించాయి. జిల్లా కోశాధికారిగా మాటూరి రవికాంత్ నియమితులయ్యారు. ఏలూరు జిల్లా బీజేపీ అధ్యక్షులు చౌటపల్లి విక్రమ్ కిషోర్ ప్రకటించిన నూతన జిల్లా కార్యవర్గంలో వీరికి చోటు లభించింది. జిల్లా కార్యవర్గ సభ్యులుగా ద్రోణంరాజు శ్రీనివాసరావు (చాట్రాయి), అనగాని రాంబాబు (ముసునూరు), రాయిపాటి లీలా విజయజ్యోతి (నూజివీడు)లను విక్రమ్ కిషోర్ నియమించారు. తమకు లభించిన బాధ్యతలతో నియోజకవర్గంలో బీజేపీ బలోపేతంకు కృషి చేస్తామని వీరు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముదినేపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని చేవూరు, కోమర్రు, చెన్నూరు, సింగరాయపాలెం, కాకరవాడ గ్రామాల్లో గురువారం ఉదయం 7 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పూర్ణచంద్రరావు తెలిపారు. విద్యుత్‌లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్లను కొట్టే పనుల కారణంగా సరఫరాను నిలిపేస్తున్నందున వినియోగదార్లు సహకరించాలని కోరారు.

కైకలూరు: గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. కైకలూరులోని 11కెవి ఆటపాక ఫీడర్ పరిధిలోని కైకలూరు, దానగూడెం, వైఎస్సార్‌కాలనీ, కరకట్ట, జాన్ పేట, ఆటపాక గ్రామాల్లో విద్యుత్ లైన్లకు దగ్గరగా ఉన్న చెట్లను తొలగించేందుకు సరఫరా నిలిపి వేస్తున్నామన్నారు.

అక్రమ మైనింగ్‌ను ఆపాలని వినతి

ఆగిరిపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమ మైనింగ్‌ను ఆపాలని వైసీపీ మండల నాయకులు డిప్యూటీ తహసీల్దార్ పవన్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. అనుమతులు లేకుండా మండలంలోని నూగొండపల్లిలోని పెద్దప్ప చెరువు, కొత్త ఈదరలోని గొల్లవాని వాగు, ఈదులగూడెం పెద్ద చెరువులో మట్టిని సమీప పొలాల్లో అక్రమంగా నిలువచేసి, విజయవాడ పరిసర ప్రాంతాలలో గల ఇటుక బట్టీలకు అధిక ధరలకు అమ్మేందుకు ఏర్పాట్లు చేసుకున్నారని తెలిపారు. అలాగే పిన్నమరెడ్డిపల్లి గ్రామ శివారు రాజవరంలో అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వి పది రోజులుగా రాత్రి సమయంలో పెద్ద సంఖ్యలో టిప్పర్ల ద్వారా విజయవాడలో వెంచర్లకు తరలిస్తున్నారని, అధికారులు అక్రమ మట్టి, గ్రావెల్ తవ్వకాలను నిలిపివేయాలని కోరారు.


కైకలూరులో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కామినేని


భైరవపట్నంలో కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ శ్రేణులు

ప్రజల ఆశలకనుగుణంగా పాలన: కామినేని

కైకలూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): అన్నివర్గాల ప్రజల ఆశలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన సాగుతోందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. బుధవారం కైకలూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా తాలుకా సెంటర్లో ఇంటింటికి వెళ్లి ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా, ఉచిత గ్యాస్, తల్లికి వందనం పథకాలపై వివరించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, చంద్రబాబు పాలనలో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉన్నారన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, కూటమి నేతలు బీకేఎం నాని, పూలా రామచంద్రరావు, గంగుల ఏసురాజు, కంచర్ల రామకృష్ణ, నల్లగోపుల చలపతి, పేరిచర్ల ప్రసాదరాజు, ఆసాని ఖాన్, వీరాబత్తిన సుధా, ఈదా వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి: రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని క్లస్టర్ ఇన్‌చార్జి కూనపురెడ్డి కోటేశ్వరరావు తెలిపారు. మండవల్లి మండలం భైరవపట్నంలో బుధవారం సుపరిపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజధాని పోలవరం నిర్మాణాలతో పాటు రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లోని రోడ్లు బాగు చేసిన ఘనత కూటమికే దక్కుతుందన్నారు. రుద్రరాజు శివకుమార్‌రాజు, గుంటూరు సత్యనారాయణ, వీరవల్లి శివయ్య, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి: గద్దె

ముసునూరు: కూటమి పాలనతోనే ప్రజా సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షులు గద్దె రఘుబాబు అన్నారు. బుధవారం వేల్పుచర్లలో సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికి టీడీపీ కార్యాక్రమంలో ఆయన పాల్గొని ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమం, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి, సమస్యలను తెలుసుకుని, కరపత్రాలను అందజేశారు. అనంతరం ఈ కార్యాక్రమాన్ని 90 శాతం పూర్తి చేసిన 103, 106 బూత్ ఇన్‌చార్జ్‌లు అబ్బినేని రాంబాబు, కుందేటి కస్తూరిలను రఘుబాబు, గ్రామ అధ్యక్షులు మానం గంటేశ్వరావు, యూనిట్ ఇన్‌చార్జ్ గరికముక్కు నాని తదితరులు ఘనంగా సన్మానించారు.

విభజన.. ఆశలు!

(5వ పేజీ తరువాయి)

చేయాలని డివిజన్ కేంద్రాన్ని మార్చవద్దంటూ అభ్యంతరాలు వెలువెత్తాయి. అయినా సరే ప్రభుత్వం మాటే చెల్లింది. నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల వారీగా ఆనాడు అభిప్రాయ సేకరణలో వచ్చిన సూచన లు ఇప్పటికీ జనం నోటే నానుతున్నాయి. మరోవైపు పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల (చిన్న తిరుపతి) గోపాల పురం నియోజకవర్గం ప్రస్తుత తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఉన్నప్పటికీ స్థానికంగా వచ్చిన డిమాండ్లకు అనుగుణంగా చిన్నతిరుపతిని ఏలూరు జిల్లాలో విలీనం చేశారు. ఉంగుటూరు నియోజకవర్గం ఏలూరు జిల్లా పరిధిలోని గణపవరాన్ని స్థానిక డిమాండ్ల మేరకు పశ్చిమగోదావరి జిల్లాలో విలీనం చేశారు.

పోలవరం కథ ఇంకొకటి..

పోలవరం కేంద్రంగా ప్రత్యేక గిరిజన జిల్లాను ఏర్పాటు చేయాలని చాలాకాలం పాటు డిమాండ్ కొనసాగుతూ వచ్చింది. ఎన్నికల ప్రచారంలో అటు టీడీపీ అధినేత చంద్రబాబుకు, ఇటు వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు స్థానికులు నేరుగానే డిమాండ్ చేస్తూ వచ్చారు. ముంపు మండలాలన్నింటిని కలిపి పోలవరం కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేయాల్సిందేనన్న డిమాండ్ కొనసాగుతూ వచ్చింది. కానీ భౌగో ళికంగా ఉన్న పరిస్థితులు డిమాండ్‌కు వ్యతిరేకంగా ఉండటంతో ముందడుగు పడలేదు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పోలవరం జిల్లా డిమాండ్ కొనసాగుతోంది. ఈ తరహా పరిస్థితులన్నింటిపైన మంత్రివర్గ ఉపసంఘం సమీక్షించబోతోంది. దీనికి అనుగుణంగా కూటమి, వైసీపీ భవిష్యత్‌లో స్థానిక అంశాల ఆధారంగా మరికొన్ని డిమాండ్లను తెరపైకి తెచ్చే అవకాశాలు లేకపోలేదు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

ఆగిరిపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ శుభశేఖర్ అన్నారు. ఎంవీఎన్ అండ్ వైవీఎన్ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా చేసుకుని సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని విద్యార్థులు అవగాహన పెంచుకుని మోసాలకు గారికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళల చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు.

బాలికపై అత్యాచార యత్నం.. పోక్సో కేసు నమోదు

భీమవరం క్రైం, జూలై 23(ఆంధ్రజ్యోతి): రెండవ తరగతి చదువుతున్న ఎనిమిదేళ్ల బాలికపై యువకుడు అత్యాచార యత్నం చేసిన దారుణ ఘటన భీమవరం పట్టణంలో చోటు చేసుకుంది. చిన్న చిన్న పనులు చేసుకుంటూ ఒక కుటుంబం జీవనం సాగిస్తోంది. వారికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. పట్టణంలోని కారెం తేజ అనే యువకుడు బాలికపై కన్నేశాడు. ఈ నేపథ్యంలో బుధవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో ఆ బాలిక ఉంటున్న గదిలోకి ప్రవేశించి కేకలు వేస్తే చంపేస్తానంటూ భయపెట్టి అత్యాచార యత్నానికిప్రయత్నించాడు. బాలిక కేకలు వేయడంతో ఆ యువకుడు పారిపోయాడు. బాలిక భయపడుతూ వివరాలు చెప్పింది. దీనిపై తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించగా యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణాజీ తెలిపారు. ప్రస్తుతం ఆ యువకుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

ఆటో బోల్తా : తప్పిన ముప్పు



కలిదిండి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూల్లంక - పెదలంక రహదారిపై ఉన్న పెద్ద గోతిలో పడి ఆటో బోల్తా పడిన సంఘటన బుధవారం మూల్లంకలో జరిగింది. మూల్లంక పీహెచ్‌సీ సమీపంలో కిరణా సరుకుల లోడుతో వెళ్తున్న ఆటో రహదారిపై ఉన్న పెద్ద గోతుల్లో పడి బోల్తా పడింది. దీంతో ఆటో డ్రైవర్‌తోపాటు మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. మూల్లంక - పెదలంక రహదారిపై సుమారు ఆరు కిలోమీటర్ల మేర గోతులు పడి అధ్వాన్నంగా ఉండటంతో లోడు వాహనాలు దిగబడటం, ఆటోలు బోల్తా పడుతున్నా పాలకులు, సంబంధిత అధికారులు పట్టించు కోవటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

భార్యను హతమార్చిన భర్త అరెస్టు



పోలీసులు అరెస్టు చేసిన హంతకుడు, వివరాలు చెప్తున్న ఏలూరు డీఎస్పీ

ఏలూరు క్రైం, జూలై 23(ఆంధ్రజ్యోతి): తమకు ఉన్న 33సెంట్ల పొలం (చెరువు)ను విక్రయించడానికి భర్త ప్రయత్నించగా అడ్డుపడుతున్న భార్యను అతి కిరాతకంగా కత్తితో నరికి హతమార్చిన భర్తను ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో కైకలూరు రూరల్ సీఐ వీరా రవి కుమార్ అరెస్టు చేశారు. బుధవారం రాత్రి ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో డీఎస్పీ శ్రావణ్‌కుమార్ కేసు వెల్లడించారు. కలిదిండి మండలం కట్టావానిపాలేనికి చెందిన కట్టా పెద్దిరాజు (48)కి భార్య జయలక్ష్మి (44) పిల్లలు ఉన్నారు. వీరికున్న 33 సెంట్ల పొలాన్ని విక్రయించడా నికి భర్త పెద్దిరాజు ప్రయత్నిస్తుండగా భార్య జయలక్ష్మి అడ్డుపడుతోంది. దీంతో ఈ నెల 10న తెల్లవారు జామున నిద్రిస్తున్న జయలక్ష్మిని అతి కిరాతకంగా నరికేశాడు. తనూ మెడ కోసుకున్నాడు. అప్పటి నుంచి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న పెద్దిరాజు బుధవారం డిశ్చార్జ్ కావడంతో ఏలూరు ప్రభుత్వాస్పత్రి వద్ద అరెస్టు చేశారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌తో పాటు సీఐ రవికుమార్, ఎస్‌ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అదృశ్యమైన విద్యార్థి ఆత్మహత్య


దానియేలు (ఫైల్)

ముసునూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఇది. లోపూడి ఎస్సీ కాలనీకి చెందిన బిల్లాబుది గోపాలరావుకు కుమార్తె రజిత, కుమారుడు దానియేలు(చందు) ఉన్నారు. అయితే విస్సన్నపేటలోని ప్రైవేటు కాలేజీలో చందు (17) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 21న హోమ్‌సిక్ సెలవులపై కాలేజీ నుంచి బయలుదేరిన చందు ఇంటికి రాకపోవడంతో మంగళవారం రాత్రి తన కుమారుడు అదృశ్యంపై తండ్రి గోపాలరావు ఇచ్చిన ఫిర్యాదుపై ముసునూరు పోలీసులు కేసు నమోదు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో విద్యార్థి ఇంటి పక్కనే ఉన్న చర్చి నుంచి బుధవారం దుర్వాసన రావడంతో కుటుంబసభ్యులు, చుట్టు పక్కల వారు లోపలికి వెళ్ళి చూడగా, చందు బాత్రూమ్‌లో ఉరి వేసుకుని విగతజీవిగా ఉన్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ చిరంజీవి ఘటనా స్థలానికి చేరుకుని, చందు మృతికి గల కారణాలపై విచారణ జరిపి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. హాస్టల్‌లో ఉండి చదువు కోవడం ఇష్టం లేక చందు ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు చెప్పినట్లు ఎస్‌ఐ తెలిపారు. తండ్రి గోపాలరావ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

మహిళ మెడలో గొలుసు చోరీ యత్నం

తీవ్రంగా వ్యతిరేకించడంతో దాడిచేసి దుండగుడు పరారీ


గాయపడిన వెంకటేశ్వరమ్మ

ముదినేపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విశ్వనాద్రిపాలెంలో వీరంకి సూర్యనారాయణ, అతని భార్య వెంకటేశ్వరమ్మ తమ నివాసం వద్దే బడ్డీ పెట్టుకుని జీవిస్తున్నారు. నాలుగు రోజులుగా ప్రతి రోజూ మధ్యాహ్నం ఆ బడ్డీ వద్దకు ఒక గుర్తు తెలియని వ్యక్తి వచ్చి అక్కడి వారితో చేపల చెరువుల లీజుల విషయమై మాట్లాడడంతో పాటు డ్రింకులు, ఇతర తినుబండారాలు కొనుగోలు చేస్తున్నాడు. ఆ క్రమంలో బుధవారం మధ్యాహ్నం వెంకటేశ్వరమ్మ ఒంటరిగా ఉండడం గమనించి నమ్మకంగా బడ్డీ వద్ద వెళ్ళి హఠాత్తుగా ఆమె మెడలోని బంగారపు నాను తాడును చాకుతో కోసేశాడు. అయితే అది తెగి ఆమె దుస్తుల్లోకి జారిపోవడంతో ఎలాగైనా దానిని దక్కించుకోవాలని ఆగంతుకుడు యత్నించగా వెంకటేశ్వరమ్మ తీవ్రంగా ప్రతిఘటించడంతో చాకు ఆమె దవడపై దిగిపోయింది. అయినా వదలకుండా ఆమె చాకును కూడా లాగేసుకుని కేకలు వేయగా చుట్టు ప్రక్కల వారు వస్తుండడంతో దుండగుడు బైక్‌పై పారిపోయాడు. దీనిపై భర్త సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు కైకలూరు రూరల్ సీఐ రవి కుమార్ ముదినేపల్లి ఎస్‌ఐ వీరభద్రరావు సంఘటనా స్థలానికి వచ్చి విచారణ జరిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకటేశ్వరమ్మ గుడివాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది.